


ఎవ్వరో తలుపు తట్టారు.

"వస్తున్నా" అన్నా నేను ఇంట్లోనుంచి.

నామాట బయటకు వినిపించినట్లులేదు. మళ్ళీ తలుపు తట్టారు.

"వచ్చే" అన్నాను బిగ్గరగా, పండుకున్న మంచంమీదనుంచి లేస్తూ. ఈ సారి నామాట వినిపించినట్లువుంది. తలుపు తట్టటం ఆగింది.

నేను వెళ్ళి తలుపు తీశాను. బయటనుంచున్నవ్యక్తి నన్ను చూచి చిరునవ్వు నవ్వాడు. అతనిని చూచి నేను ఆశ్చర్యపడ్డాను

"నీవా!" అన్నాను.

"నేనే."

అతని పేరు శ్రీనివాసరావు. అతనిని నేను పది సంవత్సరాల క్రితం ఎరుగుదును గుంటూరులో పుస్తకాలషాపు పెట్టుకొని వుండేవాడు. మంచి మంచి పుస్తకాలు అచ్చువేయించి చౌకగా ఇచ్చి, విజ్ఞానవ్యాప్తికి తోడ్పడాలనే ఉద్దేశంతో అతను ఆ షాపు ప్రారంభించాడు. అలాగే ఆయన ఆదర్శప్రాయంగా నడుపుతుండేవాడు. ఊళ్లోవున్న రచయితలూ, సాంస్కృతీపరులూ సాయంకాలంపూట కాలక్షేపానికి అతని షాపుకి వేంచేస్తూండేవారు. అటువంటివారికి అతను వొక గది

ప్రత్యేకం యేర్పాటు చేశాడు. వారికి కాఫీలూ, డ్రింకులూ సప్లయిచేయిస్తూ, అతి ఆదరంగా చూసేవాడు. అదే క్రమక్రమేణా వృద్ధిచెంది, ఊళ్లోవున్న మేధావులందరినీ ఆకర్షించి, వొక సద్గోష్టి కేంద్రంగా రూపొందింది.

ఆవూరువారే కాక పొరుగూళ్ళనుంచి వచ్చిన కవులూ, రచయితలూ ఆ గోష్టికి హాజరుకాకుండా, తిరిగివెళ్ళేవారు కాదు.

ఇది పది సంవత్సరాల క్రితం మాట. ఈ పది సంవత్సరాల్లో నేను ఉద్యోగ ధర్మాన్ని అనుసరించి అనేక పట్టణాలు తిరిగి చివరికి హైదరాబాద్‌లో సెటిల్ అయ్యాను. అతనిని అప్పటికి ఇప్పుడు మళ్ళీ చూశాను.

''చాలా మారిపోయావోయ్‌! గుర్తుపట్టలేకపోయాను,'' అని ఆశ్చర్యాన్ని ప్రకటించి ఇంట్లోకి తీసుకువచ్చాను. ''పెట్టేబేడా ఏదీ?'' అని అడిగాను.

''నేను వచ్చి రెండురోజులయింది'' అన్నాడతను సమాధానంగా.

''యెక్కడ దిగావు?''

ఎక్కడ దిగిందీ చెప్పటానికి అతను కొంచెం సంకోచించాడు. చివరికి ''కోటేశ్వరమ్మ ఇంట్లో'' అన్నాడు.

ఎక్కడ దిగిందీ చెప్పటానికి అతను యెందుకు సంకోచించాడో అప్పుడు నాకు అర్థమయింది.

కోటేశ్వరమ్మ పేరు హైదరాబాద్‌లో విననివారు వుండరు. ఆమె భర్తను విడిచిపెట్టి అయిదారు సంవత్సరాలనుంచీ హైదరాబాద్‌లోనే ఉంటూంది. ఆమెను గురించి ఇతరులు అనేక కథలు చెప్పుకుంటూవుంటారు. అయితే ఆమెకు అధికార ప్రాపకం వుండటంవల్ల, హైదరాబాద్‌లో పనులున్న పెద్దలు చాలా మంది ఆమెను ఆశ్రయిస్తూవుంటారు. పనులు చేసిపెట్టటంలో ఆమెకు పెద్దపేరు వుంది. తత్సంబంధంగా కొంత చెడుపేరుకూడా వుంది.

అతను అక్కడ వుండటం నా మనస్సును కొంచెం కలతపెట్టినా ఈ విషయాలేవీ నేను పైకి అనలేదు. అతనికి అనుమానం కలిగేటట్టుగా అటువంటి భావాన్ని పైకి పొక్కనివ్వలేదుకూడా అనుకుంటాను.

కాసేపు చాలాకాలానికి కలసినవాళ్ళం అవటంవల్ల చిన్నప్పటి సంగతులు మాట్లాడుకుంటూ కూర్చున్నాం. పుస్తకాలషాపులో తనకు నష్టం వొచ్చిందనీ, అందుకని చాలా రోజుల క్రితమే ఎత్తివేశాననీ, తరువాత కొన్నాళ్లు పుగాకు వ్యాపారం చేశాననీ, అందులోనూ నష్టమే వొచ్చిందనీ, ఇప్పుడు టెక్స్ట్‌బుక్స్

కోసం ప్రయత్నిస్తున్నాననీ చెప్పాడు. ఆ సందర్భంలోనే హైదరాబాద్ వచ్చాడట.

పుగాకులో నష్టం రావటం నిజంగా నాకు ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే ఆ వ్యాపారంలో నేను ఎరిగినవాళ్ళు యెంతమందో బాగా డబ్బు గణించి పోశారు. అదికూడా చాలా తక్కువ కాలవ్యవధిలో. ఆ మాటే అతనితో అన్నాను.

"అది నిజమే. ఆ ఉద్దేశంతోనే నేనూ ఆ వ్యాపారంలో ప్రవేశించాను. కాని నాకు కలిసిరాలేదు. ఒక సంవత్సరం నేను వేసిన పొగాకుకు రంగు రాలేదు. రెండవ సంవత్సరం ఆ నష్టం పూడ్చుకొందామని విరివిగా పుగాకు కొన్నాను. ఆ సంవత్సరం ఎక్స్‌పోర్ట్ ట్రేడ్ లేకుండా పోయింది. పూర్తిగా దెబ్బతిన్నాను. ఇక ఆ వ్యాపారానికి మనం పనికిరామని తేల్చుకొని మానివేశాను. డబ్బుకోసం ఏపనిని పడితే ఆపనిని చేయటానికి పూనుకోవటం తప్పని అనుభవంవల్ల తెలుసుకున్నాను. ఒక మనిషి కొన్నిపనులకు అర్హుడు; మరికొన్ని పనులకు అనర్హుడు" అన్నాడు.

నేను అతను వెలిబుచ్చిన భావాలతో పూర్తిగా ఏకీభవించాను. సిద్ధాంతం వరకూ ఈ విషయం నిజమే. కాని ఎవ్వరు దేనికి అర్హులో దేనికి కాదో తేల్చుకోవటమే కష్టం! అది వేదాంతులను సైతం కలవరపెట్టే సమస్య. కాని ఈ విషయాలను అతనితో చర్చించటం అతని మనస్సును కష్టపెట్టటమే అవుతుందని గ్రహించి, "మరి యీ టెక్స్ట్‌బుక్కుల గొడవ ఎంతవరదాకా వచ్చింది?" అని అడిగాను.

అతను మొదటినుంచీ ఆశావాది. ప్రతిదీ తనకు అనుకూలంగా అల్లుకునే స్వభావం కలవాడు. జీవితంలో అడుగడుక్కీ ఆశాభంగం పొందటానికి అతని ఈ స్వభావమే కారణం కావచ్చు. మళ్ళీ అటువంటి పొరపాటే ఏదన్నా చేస్తున్నాడేమోనని, "ఇవి రికమన్డేషన్ రోజులు. రికమన్డేషన్ లేకుండా ఏపనీ అవదని పలువురు అనుకొంటూవుండగా విన్నాను. అన్యాయం జరగకుండా చూచుకోటానికైనా, నేడు రికమన్డేషన్ అవుసరం అవుతూవుంది. ఆ జాగ్రత్తలో యేమైనా వున్నావా?" అని అడిగాను.

"రికమన్డేషన్ చేయించనిమాట వాస్తవమే. కాని వచ్చిన పుస్తకాలన్నిటిలోకీ నా పుస్తకాలు మంచివి. విద్యార్థులకు యేదికావాలో ముందుగా నిర్ణయించుకొని, అది మనస్సులో పెట్టుకొని మంచి మంచి రచయితలతో వ్రాయించిన పుస్తకాలు.

ఇతరులు యిచ్చేదానికన్నా ఎక్కువ యిచ్చి మంచి కాగితంమీద వొక్క తప్పుకూడా లేకుండా చాలా డబ్బు ఖర్చుపెట్టి అచ్చు వేయించాను" అన్నాడు.

"కాని అంతవరకే చేసి వూరుకుంటే పనులు కావని లోకులు అనుకుంటు న్నారు చెయ్యవలసిన పనంతా ఇప్పుడే వుంది?"

అతను ఒక్క క్షణం ఆలోచించి, నా ముఖంలోకి చూచి, "అంటే రికమన్డే షనేగా?" అన్నాడు.

"అవును. అందరూ చేస్తున్నపనే. అధికారులు అందరితోనూ చేయించు కుంటున్నపనే. తప్పేముంది?" అని అడిగాను.

అతను మళ్ళీ కొంచెంసేపు ఆలోచించాడు. "తప్పువున్నదని నేను అనను గాని, నే నాపనిలో లేనని మాత్రం చెప్పగలను" అన్నాడు.

"నువ్వు తలుచుకుంటే అదేమంత కష్టమైన పనికాదు."


"నాకు కష్టమే" అన్నాడతను.

కాని నేను అంతటితో అతనిని వొదిలిపెట్ట దలచలేదు. ఎందుకంటే అతని మాటలనుబట్టి, అతనికి డబ్బు చాలా అవుసరమని గ్రహించాను. అతని పుస్తకాలు వొకటిరెండైనా పాఠ్యపుస్తకాలుగా అంగీకరింపబడితే, పది పదిహేను వేల రూపాయల లాభం రావచ్చు. అతని కష్టాలు కొంతవరకు తీరవచ్చు. తరువాత ఇష్టంవుంటే ఈ వ్యాపారంలో వుంటాడు. లేకపోతే ఆ డబ్బుతో మరొక వ్యాపారం పెట్టుకుంటాడు. పైగా కోటేశ్వరమ్మ అధికారులచెవిలో వొకమాట వేస్తే ఈ పని ఊరికినే అవుతుందని నానమ్మకం. కోటేశ్వరమ్మ అతనికి బాగా పరిచయం వున్న మనిషేనాయె. ఇటువంటి అవకాశం అతను జారవిడుచు కోవటం నా కేమాత్రం ఇష్టంలేకపోయింది.

"మన సరుకు మంచిదని చెప్పి ఇంట్లోపెట్టుకు కూర్చుంటే ఎవ్వరికి తెలు స్తుంది శ్రీనివాస్? మనదగ్గర మంచి సరుకు వుందనే విషయం పదిమందికీ తెలియజెయ్యవలసిన బాధ్యత కూడా మనమీదే వుంటుంది. రికమన్డేషన్ అంటే అదే. అదేదో భయంకరమైన పెద్దపులి అనుకొని నీవు భయపడవలసినఅవుసరం లేదు. నామాట విని ఎవరితోనైనా వొకమాట చెప్పించు," అన్నాను.

వీలుంటే కోటేశ్వరమ్మతో చెప్పించమనే నా వుద్దేశం. కాని ఎందుకనో అతనితో ఆ మాట నగ్నంగా చెప్పలేక 'ఎవ్వరితోనైనా వొకమాట చెప్పించు' అని వేగ్‌గా ఒక మాటవేసి వూరుకున్నాను.

అతను మాట్లాడలేదు. యేదో ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. అతని




వైఖరి చూచి నేను చెప్పిన విషయం అతని మనస్సుకు ఎక్కుతూవుందని ఆశ పడ్డాను. అతనిని వొప్పించటానికి అంతకంటే మంచి అదను దొరకదను కున్నాను. అతని ముఖాన్ని తప్పించి చూస్తూ, "ఇప్పుడు కోటేశ్వరమ్మగారి యింటో వుంటున్నా నన్నావుగదూ?" అని ప్రారంభించాను.

"అవును. అక్కడ వుంటున్నాను" అన్నాడు అతను నా కండ్లలోకి ఆశ్చ ర్యంగా చూస్తూ.

"ఆమెకు నువ్వేపనిమీద వొచ్చింది తెలుసా?" అని అడిగాను.

"తెలియదు"

"ఆమెకు తెలియజెయ్యటం మంచిదనుకుంటావు?"

"దేనికి?"

"ఇటువంటి పనులు చేయించటంలో ఆమెకు మంచి పలుకుబడీ, నేర్పూ వున్నాయని నేను వింటున్నాను" అన్నాను.

అతను మళ్ళీ కాసేపు మౌనంగా వున్నాడు. నా మాటలకు అతని ముఖం వివర్ణం అవటం నేను గమనించాను. అతను మొదటినుంచి ఆశావాదేకాక, నైతిక జీవనంమీద మమకారం వున్నవాడని నాకు తెలుసు. అయినా యిందులో తప్పేమివుంది? అతను వొకవేళ రికమెండ్ చేయించకపోయినా, ఆ అవకాశం అర్హునికి లభిస్తుందనే ఆశ ఎక్కడుంది? మరొక పలుకుబడి కలిగిన వ్యక్తి రికమెండ్ చేయించుకోవచ్చు. అతనిపని నెరవేరవచ్చు.

"నేనీవూరుపరిస్థితి ఎలావుందో తెలుసుకుందామని వొచ్చాగాని, రికమెండ్

చేయించుకోటానికి కాదు" అన్నాడు శ్రీనివాసరావు, తనపట్ల నాకేదన్నా దురభిప్రాయం కలిగివుంటే తొలిగిద్దామనే వుద్దేశంతో.

అతని చాదస్తానికి నా మనస్సు చివుక్కుమన్నది. "సరే నీ ఇష్టం" అన్నాను.

అతను కాసేపు అలోచనా నిమగ్నుడై, చివరికి "ఈ సందర్భంలో నీ కొక విషయం చెప్పటం మంచిదనుకుంటాను," అన్నాడు.

"యే విషయం?" అని అడిగాను నేను.

అతను చెప్పాడు.

"కోటేశ్వరమ్మతో నాకు పరిచయం చాలా తక్కువ. ఒకసారి ఆమె గుంటూరువస్తే వేరేపనిమీద ఆమెను నేను కలిశాను. పనిచేసిపెట్టింది. తరువాత యేవో మాటలమీద ఎప్పుడన్నా హైదరాబాద్ వస్తే తన ఇంటో దిగవలసిందని ఆహ్వానించింది. నేను అంగీకరించాను. నేను అక్కడ వుండగానే ఆమెను గురించి అనేక అపవాదులు విన్నాను. అయినా అన్నమాట ప్రకారం ఆమె ఇంట్లోనే దిగాను. దిగటం మంచిపనే చేశాను అని ఇప్పుడు అనుకుంటున్నాను. ఆమెను గురించి ఇతరులు చెప్పుకొనే మాటలు ఎంత అబద్ధాలో, ఆమె ఎంత మంచిదో ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం దొరికింది" అన్నాడు.

"మంచి మనిషే అయివుండవచ్చు" అన్నాను.

"అయిఉండవచ్చంటావేమిటి? చాలా మంచి మనిషి. నా మట్టుకు నేను ఇంతవరకు ఇటువంటి మనిషిని ఎక్కడా చూడలేదు. నీ కీ సంగతి తెలుసా? ఆమె ఇప్పటికీ ప్రతిరోజూ తన భర్తను పూజిస్తూ వుంటుంది."

"భర్తను పూజిస్తూ వుంటుందా?" అని ఆశ్చర్యంగా అడిగాను నేను.

"అదే, అంటే భర్తఫొటోను" అని వివరించాడు శ్రీనివాసరావు.

"ఎందుకు పూజించటం?" అని అడిగాను.

"భర్త అంటే ఇప్పటికీ ఆమెకు అంత పూజ్యభావం."

"మరి భర్తను విడిచిపెట్టిందని విన్నానే!"

"విడిచిపెట్టిందంటే తప్పక విడిచిపెట్టింది. అతను ఆమెను చాలా కష్టపెట్టేవాడు. అయినా ఆమె వోర్చుకొని కాపురం చేసింది. తరువాత అతను మరొక స్త్రీని ప్రేమించాడు. ఆమెను ప్రేమించటం మొదలుపెట్టినాక అతనిలో చాలా మంచి మార్పు వొచ్చింది. ఆమెను హృదయ పూర్వకంగా ప్రేమించటంవల్లే, తన భర్తలో ఈ మార్పు వచ్చిందనీ, ఆ క్రొత్తమనిషి నిష్కళంక ప్రేమే తన




భర్తలో వచ్చిన ఈ మార్పుకి కారణమనీ కోటేశ్వరమ్మ గ్రహించింది. వెంటనే తన ప్రేమలో ఏమూలనో ఎంతో కొంత మలినం దాగిఉండబట్టే తన భర్త యిన్నాళ్ళూ అలా ప్రవర్తించాడని ఊహించుకుంది. ఇక వారిద్దరికీ అటంకంగా నిలబడటం తగదనుకుంది. వారిద్దరూ వివాహం చేసుకొని సుఖంగా జీవయాత్ర చెయ్యటానికి తోడ్పడటమే తన విద్యుక్తధర్మం అనుకున్నది. భర్తనుంచి బల వంతంగా తెంచుకుంది. భర్త సుఖం కోరి అత్యద్భుతమైన త్యాగం చేసింది" అన్నాడు.

శ్రీనివాసరావు కథను వినిపిస్తున్న నా చెవులను నేనే ఆ క్షణం నమ్మలేక పోయాను. "నేను విన్న కథ వేరు" అని గొణిగాను.

ఆమెను గురించి ఎన్ని కథలనైనా వినవచ్చు. ఒక స్త్రీ భర్తను విడిచి ఒంటరిగా జీవిస్తూవుందంటే మన సమాజంలో కథలకూ, అపవాదులకూ కరువా? కాని మనబోటివాళ్ళం కూడా ఆ గాలి కథలను నమ్మితే ఇక ప్రపంచం నిలుస్తుందా? ఈ ప్రపంచంలో మంచివాళ్ళు బ్రతికే ఆస్కారంవుంటుందా? ఎవరెన్నయినా చెప్పనీ, నిజంకథ నేను చెప్పిన కథ" అన్నాడు.

"నీ కెవరు చెప్పారు ఇవన్నీ?" అని అడిగాను.

"ఒకరు చెప్పటం ఏమిటీ? ఆమే చెప్పింది."

"ఎక్కువ పరిచయం లేదంటున్నావుగదా! నీతో ఎందుకు చెప్పవలసి వచ్చింది."

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటానికి అతను కాసేపు సంకోచించాడు. చివరికి నెమ్మదిగా తల పైకెత్తి "నీకు తెలియందేముంది? వొక్కొక్కరి ముఖంచూస్తే వొక్కొక్కరికి తమకష్టాలను వెళ్ళబోసుకో బుద్ధి అవుతుంది. కష్టాలు చెప్పుకోటానికి సానుభూతితో అర్థంచేసుకునే మనిషి దొరకాలి గదా! అలా దొరికినప్పుడు మనస్సు సమయాసమయాలను ఆలోచించదు. పరిచయా పరిచయాలను గమనించదు. కట్టలు త్రెంచుకొని ప్రవహిస్తుంది" అన్నాడు.

అతను పైకి చెప్పకపోయినా; తన సంగతి అతనికి చెప్పేముందు కోటేశ్వరమ్మ ఈ మాటలు అతనితో అని వుంటుందని నేను ఊహించాను. ఆ మాటలే అతను సొంతంగా నాతో అంటున్నాడు. ఇక నేనేమీ అడగకుండా ఊరుకున్నాను.

"కోటేశ్వరమ్మతో నీకు పరిచయం వున్నదా?" అని అతనే అడిగాడు.

"లేదు."

"నువ్వు పరిచయం చేసుకోవలసిన మనిషి" అన్నాడు.

"నా సంగతి నీకు తెలుసుగా శ్రీనివాస్ నేను యితరులతో తొందరగా పరిచయం చేసుకోగలిగిన స్వభావం గలవాడిని కాదు."

"అయితే మాత్రమేం? కొంతమందితో పరిచయమే ఎడ్యుకేషన్. అనేక గ్రంథాలు చదివినట్లు, అనేక పుణ్యక్షేత్రాలు దర్శించినట్లు, ఈ రెండురోజుల్లో జీవితానికి సంబంధించిన విషయాలు ఆమెవల్ల నేను యెన్నో నేర్చుకొన్నాను. తామరాకుమీద నీటిబొట్టువలె ఆమె జీవితాన్ని నడుపగలదు. నువ్వు ఇందాక అన్నావు చూడు, ఆమె పనులు చేసిపెట్టడంలో బహునేర్పరి అని. అది నిజమే. పెద్ద పెద్ద ధనవంతులు, సంఘంలో పలుకుబడి గలవారు, ఉన్నత పదవుల్లో ఉన్నవారు, ఎంతమందో ఆమెకోసం రోజూ వొచ్చి పోతుంటారు పెద్ద పెద్ద కార్లు వేసుకొని నౌకర్లను వెంటబెట్టుకొని వొచ్చేవాళ్ళుకూడా వున్నారు. వాళ్ళని కోటేశ్వరమ్మ డీల్‌చేసే విధం నువ్వు చూచివుంటే అక్కడే మూర్ఛపోయి వుందువు," అన్నాడు. అని ఆ దృశ్యాలు జ్ఞాపకం వచ్చికాబోలు, తనలో తానే నవ్వుకున్నాడు. "ఓహో! ఆమె రాజ్యాలు ఏలవలసిన మనిషి" అన్నాడు.

అతను మామూలుగా చిన్నచిన్న విషయాలకు ఆవేశపడే మనిషికాదు. కాని కోటేశ్వరమ్మ విషయం చాలా ఆవేశంగా చెప్పాడు. అతను చెప్పే వైఖరిని

బట్టి ఆమెను గురించి ఇంకా వినాలనిపించింది నాకు. కాని లోతుకు దిగి అడిగితే ఏమనుకుంటాడో అని, "ఆమె దగ్గరకు చాలా మంది వొస్తూవుంటారా?" అని ఒక ప్రశ్న వొదిలిచూశాను.

"చాలా మందేమిటి? వొచ్చే పోయే మనుష్యులకు అంతే వుండదు. అడిగిన కోర్కెలను అడిగినట్లు తీర్చే వొక స్వాములవారిని, అడిగిన వరాలను అడిగినట్లు ఇచ్చే వొక దేవతను దర్శించుకోటానికి వచ్చినట్లు వస్తారు."

"వాళ్ళంతా పనులమీద వచ్చేవాళ్ళేనా?"

"ఆఁ. అంతా అటువంటివాళ్ళే. కొంతమందికి, వచ్చి దర్శనం చేసుకువెళ్ళే రోజే పనిలేకపోవచ్చు. ఎప్పుడు పనిపడుతుందో, ముందుగానే పరిచయం చేసుకొనివుంటే మంచిదిగదా అనే వుద్దేశంతో వొచ్చిపోయేవాళ్ళు కొందరు వుంటారు. వొచ్చినవాళ్ళందరూ ముందు ముఖప్రీతి మాటలతో ప్రారంభిస్తారు.

"తమరి దర్శనం చేసుకుపోదామని వచ్చాను" అంటారు.

"అయ్యయ్యో, అలా చిక్కిపోయారేం?" అని సానుభూతి వెల్లడిస్తారు.

"తమరి పేరు విన్నాను చూచిపోదామని వచ్చాను" అంటారు.

"మీ వంట్లో కులాసాగా వుందా?" అడుగుతారు కొందరు.

"ఎక్కడ చూచినా తమరి పేరే చెప్పుకుంటున్నారు. తమరివంటి ధర్మమూర్తులు లేరని అనుకుంటున్నారు. కోటేశ్వరమ్మగారి పేరు రామనామం అయిపోయింది" అని కొందరు పలవిస్తారు.

"కాని ఆమెకు ముఖప్రీతి మాటలంటే ఇష్టముండదు. 'నేను మీ మాటలు నమ్మే స్థితిలో లేను. మీరు వచ్చిన పనేమిటో చెప్పండి' అని నిర్మొగమాటంగా నిష్కర్షగా అడుగుతుంది. ఈ మాటకు వారు భీతుకుడిచి పసిపిల్లలు తమకోర్కెలను నంగినంగి మాటలతో వెలిబుచ్చుతారే, అలా వెలిబుచ్చి వెళ్ళిపోతారు. వాళ్ళు వెళ్ళగానే ఆమె విరగబడి నవ్వుతుంది 'ఆడదాన్నిగదా, మాయమాటలు చెప్పి పనులు చేయించుకోలేకపోతామా అనే ధీమాతో వస్తుంటారు. పాపం!' అంటుంది. అని పొర్లిపొర్లి నవ్వుతుంది. అలా పొర్లుతూ ఆమె అనుభవించే ఆనందం, ప్రత్యక్షంగా చూడవలసిందేగాని వర్ణించలేం పసిపిల్ల ప్రవర్తించినట్లు ప్రవర్తిస్తుంది."

"చూచేవాళ్ళకు చేతుల్లోకి తీసుకొని లాలించబుద్ధికూడా అవుతుందను

అతను నా ఉద్దేశం గ్రహించటానికిగాను, వొక్క క్షణం నిశితంగా నా ముఖంలోకి చూచి "అవును'' అన్నాడు.

ఈ 'లాలించటం' గొడవ నిజం చెప్పాలంటే నేను అనాలని అనలేదు. అతను కోటేశ్వరమ్మను పసిపిల్లలతో పోలుస్తూవుంటే అప్రయత్నంగా నా నోటి నుంచి మాట వెలువడింది. ఈ మాటకు శ్రీనివాసరావుకు కోపం రానందుకు నేను నా మనస్సులో చాలా సంతోషించుకున్నాను.


విషయం మారుద్దామనే వుద్దేశంతో, ''ఇంతమంది వచ్చి పోతుంటారని చెపుతూన్నావు గదా, వీరందరి పనులూ చేసిపెడుతుందా కోటేశ్వరమ్మ'' అని అడిగాను

''చేసిపెట్టేవారికి చేసిపెడుతుంది, లేనివారికి ముఖం ఎదుటే కుండ బ్రద్దలు గొట్టినట్లు నేను చేసిపెట్టనని చెపుతుంది. నేను వచ్చినరోజే ఈ వూళ్ళోవున్న పెద్ద ధనవంతుడు ఒకాయన ఏదో ఫ్యాక్టరీకి లైసెన్స్ ఇప్పించమని వచ్చారు. అతను అంత పెద్దధనవంతుడు గదా అని ఆమె యేమన్నా తొణికిందను కున్నావా? లేదు. అతనిని నిలబెట్టి తాను కూర్చుని మాట్లాడింది. అంత పెద్ద వాడు ఆమె ముందు చేతులు కట్టుకొని మాట్లాడుతుంటే చూడటానికి నాకే ఆశ్చర్యంవేసింది. అతనితో 'నీ కెందుకు లైసెన్స్ యిప్పించాలి. యింకా బీద వాళ్ళని హింసించే అవకాశం నీకు కల్పించటానికేగదా? నేను ఇప్పించను' అని ఖండితంగా చెప్పేటప్పటికి అతను తెల్లగుడ్లు వేశాడు. పాపం అతన్ని చూస్తే నాకే జాలివేసింది. ఆమె చాలా నికార్సయిన మనిషి. అందులో సందేహంలేదు. పెద్దపెద్ద వాళ్ళందరూ ఆమె ఎదురుగా కూర్చోటానికే జంకుతారు. పోనీ ఆమె కేమన్నా పెద్ద పొజిషన్ వుందా అంటే అదీ లేదు. ఆ మహత్యం ఆమె పర్స నాలిటీలో వుంది. కొంతమందితో కఠినంగా వున్న ఈ మనిషి మరికొందరిపట్ల ఎంతో సుహృద్భావం ప్రకటిస్తుంది. వారు అడిగీ అడగకముందే వారి పనులు చేసిపెడుతుంది. స్నేహానికి ప్రాణంఇచ్చే మనిషి ఆమె."

"వస్తుతః బాగా డబ్బున్న మనిషి అనుకుంటాను" అన్నాను,

''ఆమె పేర దమ్మిడీ ఆస్తిలేదు. భర్తనుంచి విడిపోయేటప్పుడు అతని దగ్గరనుంచి దమ్మిడీ పుచ్చుకోకపోగా, తనపేర వున్న ఆస్తికూడా అతనికే వ్రాసియిచ్చి వచ్చివేసింది".

"పనులు చేసిపెట్టి డబ్బు తీసుకుంటూ వుంటుందని పలువురూ చెప్పుకుంటూ వుంటారు" అన్నాను ధైర్యంచేసి.




"వొట్టిది. ఆమాట వొట్టిది" అన్నాడు శ్రీనివాసరావు. 'తన డబ్బు ఖర్చు పెట్టే ఇతరులకు పనులుచేసి పెడుతూవుంటుంది. ఆమె తన కారుతో, తన పెట్రోలుతోనే తిరుగుతూ వుంటుంది. ఆమె యింట్లో నిత్యం నలుగురైదుగురు బీద విద్యార్థులు భోజనం చేస్తూంటారు. కొంతమందికి జీతాలుకూడా కడుతుంది. నీకు చెప్పవలసిన సంగతి మరొకటి వుంది. ఆ మధ్య ఒక పెద్దమనిషికి ఆమె ఏదో పనిచేసిపెట్టిందట. అతను నేను వుండగానే వెయ్యిరూపాయలు తీసుకు వచ్చి పారితోషికంగా తీసుకోవలసిందని ప్రాధేయపడ్డాడు. ఆమె వొద్దంటే వొద్దన్నది. పుచ్చుకునేది ఏదో భగవంతుడి దగ్గర పుచ్చుకోవాలిగాని మనుష్యుల దగ్గర పుచ్చుకోవటంలో అర్థం లేదన్నది. తనకు కావలసింది వొక్క భగవంతుడు తప్ప మనుష్యులెవ్వరూ ఇవ్వలేరన్నది, అయినా అతడు వినలేదు. 'మా సంతోషంకొద్దీ ఇస్తున్నాం. మా మురిపెం తీర్చవలసిం'దని బ్రతిమాలాడు. అప్పుడామె ఏం చేసిందనుకున్నావు? అతని చేతుల్లోనుంచి వెయ్యిరూపాయలూ తీసుకొంది. అతనిని కూర్చోమనిచెప్పి, చుట్టుపట్లవున్న బీదవాళ్ళని పదిమందిని పిలిచింది. అతని కండ్లముందే ఆ బీదవాళ్ళకు తలకొక పదిరూపాయల చొప్పున పంచిపెట్టింది. 'మీకు సంతృప్తిగా వున్నదా? ఇక వెళ్ళండి' అని చెప్పి ఆ పెద్దమనిషిని పంపించివేసింది. ఇది అక్షరాలా నా కండ్లముందు జరిగిన సంఘటన. నా కండ్లతో నేను చూచిన సంఘటన!!" అన్నాడు.

"మరి ఆమెకు ఎట్లా గడుస్తోంది?"

"అదే విచిత్రం. పైగా డబ్బంటే ఆమెకు లెక్కలేదు. నీళ్ళ ప్రవాహంలాగు ఖర్చుపెడుతుంది" అన్నాడతను.

నేనిక తరచలేదు. తరచి మాత్రం ప్రయోజనం ఏముంది? డబ్బు రావటాన్ని భగవంతుని చిద్విలాసం క్రింద జమకట్టి మాట్లాడే మనిషితో ఎంత తరచి ఏం ప్రయోజనం? అతను కాస్సేపు కూర్చుని చిన్ననాటి సంగతులు ఏవేవో గుర్తుకుతెచ్చి మాట్లాడి వెళ్ళిపోయాడు.

వెళ్ళేముందు మరునాడు ఉదయం భోజనానికి రావలసిందని నేను ఆహ్వానించాను.

అతను కొంచెం తటపటాయించి "భోజనానికి మాత్రం రాలేను. ప్రొద్దుకుంకేలోగా ఎప్పుడో ఒకప్పుడు వచ్చి చూచిపోతాను" అన్నాడు

"రేపేమైనా పనివుందా?" అని అడిగాను.

"పెద్ద పని ఏమీలేదు" అని నసిగా డతను.

"పనిలేకపోతే - తప్పకుండా రా - అసలు సరాసరి మా ఇంటికి రావలసినవాడివి. రాలేదు. ఒకపూట కలిసి భోజనమైనా చెయ్యకపోతే నా మనస్సుకు తృప్తిగా ఉండదు" అన్నాను

అతను తలవంచుకొని, "ఈ రెండురోజులనుంచీ ఉంటున్నది కోటేశ్వరమ్మ యింట్లోనే అయినా హోటల్లోనే భోజనం చేస్తున్నాను. రోజూ ఆమె తనతో భోజనం చెయ్యవలసిందిగా అడగటం, నేను ఏదో ఒక నెపంతో తప్పించుకోవటం జరుగుతూవుంది. ఉదయం నేను ఇక్కడకు బయలుదేరేముందు, ఆమె చాలా నిష్ఠూరంగా మాట్లాడింది. ఇవ్వాళ్ళ ఊళ్ళో పనివుంది వెళుతున్నాననీ, సాయంకాలంవరకూ తీరదనీ, రేపు ఉదయం తప్పకుండా ఆమెతో కలిసి భోజనం చేస్తానని చెప్పివచ్చాను" అన్నాడు.

"అయితే సరే. వెళ్ళేలోగామాత్రం ఒకసారి నాతో కలిసి భోజనంచేసి వెళ్ళాలి. ఈ విషయం జ్ఞాపకం పెట్టుకో" అన్నాను.

"సరే" అని చెప్పి అతను వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయిన తదుపరి నేను చాలాసేపు ఆలోచిస్తూ కూర్చున్నాను. శ్రీనివాసరావు నాకు తెలిసినంతవరకు స్త్రీ వ్యామోహం వున్న మనిషికాదు. అబద్ధాలు ఆడే మనిషి అంతకంటే కాదు. కాకపోతే ఒకదానినుంచి వొకదానికి అల్లుకుపోయే స్వభావంవుంది. ఉన్నదానికంటే ఎక్కువ ఊహించుకొని

భవ్యహర్మ్యాలు నిర్మించుకుంటూ పోతాడు. కోటేశ్వరమ్మపట్ల ఎంతదూరం ఈ విధంగా అల్లుకుపోతాడో? ఎక్కడకు జేరి వెనుతిరిగిచూస్తాడో? ఇటువంటి విషయాలు, జరిగింతర్వాత తెలుసుకోగలమేమోగాని ముందుగా తేల్చుకోలేం.

అయితే అతనిపట్ల కోటేశ్వరమ్మ ప్రవర్తన మరీ విచిత్రంగా వున్నట్లు అనిపించింది నాకు. అతనిపట్ల ఆమె ఎందుకు అలా ప్రవర్తిస్తూవుందో అనలే తెలుసుకోలేకపోయాను. అది బొత్తిగా నా ఊహకు అందని విషయమైంది.

అతని కథను కాలానికి వొదిలి వూరుకోవటం ఉత్తమమనిపించింది. ఊరుకున్నాను.

మరునాడు శ్రీనివాసరావు రాలేదు. వరసగా మూడురోజులు అతనికోసం ఎదురుచూచాను. రాలేదు. అతని టెక్స్టుబుక్కుల ప్రయత్నం ఏమయిందో, అతనేమయ్యాడో తెలియక నేను ఆందోళనపడ్డాను. నాలుగోరోజు ఉదయం అసలు సంగతి ఏమిటో తెలుసుకుందామనే ఉద్దేశ్యంతో అతను ఉన్నాడేమో తెలుసుకురమ్మని, మా నౌకర్ని కోటేశ్వరమ్మ యింటికి పంపాను.

అతను లేడు. అంతకు ముందురోజే వెళ్ళిపోయాడని కోటేశ్వరమ్మ చెప్పిందట. ఎవ్వరు కనుక్కొనిరమ్మన్నారో, శ్రీనివాసరావుకీ నాకూ వున్న సంబంధం ఏమిటో, ఇక్కడ వున్న రోజుల్లో శ్రీనివాసరావు మా యింటికి ఎప్పుడయినా వొచ్చాడో లేదో మా నౌఖరుని ఆమె మరీ మరీ అడిగి తెలుసుకుందని అతను తిరిగివచ్చి చెప్పాడు.

నాకు చెప్పకుండా అతను ఎందుకు వెళ్ళిపోయాడో, ఎంత ఆలోచించీ ప్రయోజనంలేకపోయింది. అందులో మాట అన్న తరువాత ఎంత కష్టపడయినా నిలబెట్టుకోటానికి ప్రయత్నించే మనిషి అతను. కోటేశ్వరమ్మ మాటలనుబట్టి నాతో కలిసిన పిదప అతను మూడురోజులు హైద్రాబాద్‌లో వున్నట్లు తేలుతూవుంది. నాకు కనపడిపోవటానికి తీరికలేకపోయిందా? ఆలోచించినకొద్దీ నాకంతా గొడవగా కనుపించింది.

తరవాత కొన్నాళ్ళకు ఢిల్లీనుంచి కేంద్ర మంత్రి ఏదో పనిమీద హైదరాబాదు వస్తుంటే నా స్నేహితుడైన కిషన్‌ప్రసాదు వారికి పెద్ద టీ పార్టీ ఏర్పాటుచేసి పురప్రముఖుల నందరినీ ఆహ్వానించాడు. నేనుకూడా వెళ్ళాను. ఆ పార్టీకి కోటేశ్వరమ్మకూడా వొచ్చింది. ఆమె నా బల్లకు ఎదురుగావున్న బల్ల దగ్గర కూర్చుంది. మంచి ఖరీదుగల బట్టలు కట్టివుంది. తళతళ మెరుస్తున్న

వజ్రాలహారం మెడలోవుంది. పెదవులకు లిప్‌స్టిక్‌వేసి, గోళ్ళకు క్యూటెక్స్, హైహీల్డుషూస్ తొడిగి చాలా అప్‌టుడేట్‌గా డ్రెస్ చేసుకునివుంది.

నా ప్రక్కన కూర్చొన్న నా మిత్రుడొకడు రహస్యంగా "ఆమెను ఎరుగుదువా" అని అడిగాడు.

"ఎరుగను" అన్నాను.

"ఎరుగకపోవటం ఏమిటి? ఈ పట్టణంలోకెల్లా పెద్ద రాకెట్ అయితేను" అన్నాడు.

"ఆమె పేరేమిటి?"

"కోటేశ్వరమ్మ."

ఆమె కోటేశ్వరమ్మ అని తెలుసుకొని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. ఆమెను గురించి నాకు చాలా మంది చాలా సంగతులు చెప్పారు. శ్రీనివాసరావు చెప్పిన మాటలు మీకు తెలిసినవే; కాని ఎందుకనో నేను విన్న మాటలనుబట్టి ఆమె ఈ విధంగా వుంటుందని నేను ఊహించుకోలేదు.

ఆమె డ్రెస్ చేసుకోవడం చాలా బాగా డ్రెస్ చేసుకుంది. అందులో సందేహం లేదు అక్కడికి వచ్చినవారి చూపులన్నీ ఆమెమీదనే వుండేఅంత అందంగా ఉంది. అందులో సందేహంలేదు. ఆమె అవయవాలన్నీ తీర్చిదిద్దినట్లుగా ఉండి పోతపోసిన విగ్రహంలాగుంది. అందులో సందేహంలేదు. ఆమె అస్తమానం వారితో వీరితో మాట్లాడుతూనే ఉంది. నవ్వింది నవ్వినట్లే వుంది కాని ఆమె చూపుల్లో విపరీతమైన దైన్యం గోచరించింది నాకు. తనచుట్టూ జేరినవారితో వొక చెంప మాట్లాడుతూనే ఆమె కళ్ళు దూరంగా ఉన్న ఎవ్వరినో వెదుకుతున్నట్లు ఉన్నాయి. కాసేపు చూడగానే ఏ మనిషినీ ఉద్దేశించి ఆమెకండ్లాపని చెయ్యటంలేదని నేను గ్రహించాను. అవి వెతుకుతున్నాయి. అంతే ఎవ్వరినీ కాదు.

టీ పార్టీ జరుగుతూనే ఉంది; అంతా టిఫిన్లు తింటూనే వున్నారు. ఆమె నాలుగయిదుచోట్లకు మారింది. అన్నిచోట్లా ఆమెను ఎరిగినవాళ్లు ఎవ్వరో ఒకరు ఉంటూనే ఉన్నారు. వారందరినీ ఆమె పలకరించింది. ఎవ్వరికివారు ఆమె తమ బల్లదగ్గర కూర్చున్నందుకు సంతోషించేవారు, అంతలో "ఒహో మీరా?" అని ప్రక్కబల్లదగ్గర కూర్చున్న వ్యక్తిని పలకరించి అక్కడికి వెళ్లేది. ఆమె అటు తిరగగానే, ఆమె విడిచిపెట్టిన బల్లదగ్గర కూర్చున్న వ్యక్తులు అంతకు

ముందు ఆమెతో ఎంతో సంతోషంగా మాటాడుతున్నవారు, గుసగుసలు ప్రారంభించేవారు.

అటు ఆహ్వానింపబడి, ఇటు ఆహ్వానింపబడి, ఆమె నాకు కనుమరుగైంది. నేను ఆలోచిస్తూ కూర్చున్నాను

"ఇదే మొదటిసారి చూడటం కాబోలు" అన్నాడు నా ప్రక్కన కూర్చుని టిఫిన్ తింటున్న మిత్రుడు.

"అవును" అన్నాను యదాలాపంగా.

"మొదటిసారిగా చూచినప్పుడు ఎవ్వరికయినా తలతిరుగుతుంది" అన్నాడు.

అతని మాటలకు నాలో నేను నవ్వుకున్నాను. నేను అప్పుడు ఆలోచిస్తున్నది కోటేశ్వరమ్మ సంగతి కాదనీ, నా స్నేహితుడైన శ్రీనివాసరావు సంగతనీ చెపితే మాత్రం వారు నమ్ముతారా? నమ్మరు. అందుకని నవ్వి ఊరుకున్నాను.

"మనిషి మంచిదనే అంటారు'' అన్నాడు నా ప్రక్కన కూర్చున్న మిత్రుడు.

"ఆ మంచిదే" అని పెదవి విరిచాడు అతని ప్రక్కన కూర్చున్న వ్యక్తి.

"అయ్యో, నాలుగు డబ్బులు సంపాదిస్తే అంతా మంచివాళ్ళే" అని రాగాలు తీశారు మరొకరు.

తమకంటే జీవితంలో అదృష్టవంతులుగా ఉన్నవాళ్ళని చూస్తే కొంత మందికి ఈర్ష్య అనుకుంటాను. ఇటువంటి మాటలతో ఈ ఈర్ష్యను కప్పుకోటానికి ప్రయత్నించటం నేను ఇటీవల మామూలుగా చూస్తున్నాను. కాకపోతే వ్యక్తి ఎటువంటిదైనా, ఇలా మాట్లాడుకోవలసిన అవసరం ఏముంటుంది?

నేను వారి మాటలు వినిపించుకోనట్లు నటిస్తూ కాఫీ త్రాగనారంభించాను.

ఇంతలో ఎవ్వరో నా పేరుపెట్టి పిలిచారు. ఎవ్వరా అని వెనుదిరిగి చూశాను. అక్కడ ఉన్న నౌకర్లలో వొకడు ఫలానివారు మీరేనా అండీ? అని అడిగాడు. అవును అన్నాను. అతను నా చేతికి వొక చీటీ అందించాడు. అది కోటేశ్వరమ్మ దస్కత్తుతో ఉన్న చీటీ. ఆమె నాకెందుకు చీటీ వ్రాసిందా అని ఆశ్చర్యపడి చదివాను. నాతో కొద్దిగా మాట్లాడవలసినపని వుందనీ, తానెక్కడ ఉన్నదీ ఆ నౌఖరు చూపగలడనీ ఆ చీటీలో వ్రాసివుంది. నాకు వ్రాసిందేనా అని చూశాను. నా ఇంటిపేరుతోసహా నాపేరు వ్రాసివుంది. పద వస్తున్నాను అని అతనివెంట బయలుదేరాను.

టీ పార్టీ జరిగింది మేడముందున్న తోటలో. ఆ నౌఖరు నన్ను మేడలోకి తీసుకువెళ్ళాడు. మేడ హాల్లో పెద్దలందరూకూడి ఏవో కబుర్లు చెప్పుకుంటు న్నారు. కేంద్ర మంత్రి కూడా అక్కడే ఉన్నారు. వారి మధ్యఉండి నవ్వుతూ వెలుతూ ఉంది కోటేశ్వరమ్మ. నన్నుచూచి ఎదురుగావచ్చి ప్రక్కగదిలోకి తీసుకువెళ్ళింది అందరిచూపులూ ఎలెక్ట్రిక్ బల్బ్సుకు మల్లే మా వైపుకు ప్రస రించటం నేను గమనించాను.

ఆ గదినిండా చాలా ఖరీదైన సోఫాలున్నాయి. తానొక సోఫాలో కూర్చొని ఎదురుగావున్న సోఫాలో ఆమె నన్ను కూర్చోమన్నది. నిజంగానే ఆమెలో యేదో వింత ఆకర్షణ వున్నట్లు నే నప్పుడు కనిపెట్టాను.

"నేను మిమ్మలను ఎలా తెలుసుకున్నానా అని ఆశ్చర్యపడుతున్నారు కదూ?" అని అడిగిందామె.

"కొంతవరకు" అన్నాను నేను

"మీ మిత్రులు మిమ్మలను పేరున పిలుస్తుంటే విన్నాను" అన్నది.

నాకేమీ తోచక నవ్వి వూరుకున్నాను.

"అంతకుముందే మీరు నాకు శ్రీనివాసరావుగారిని గురించి ఉత్తరం వ్రాశారు."

"అవును. అతను వెళ్ళేలోగా మా ఇంటికివచ్చి కనపడివెళ్తానని చెప్పాడు. రాకపోయేప్పటికి యేమయ్యాడో తెలుసుకుందామని మీ ఇంటికి కబురు పంపాను"

ఆమె అకస్మాత్తుగా చూపులను నావైపునుంచి హాల్లోవున్న మనుష్యులమీదకు త్రిప్పింది. అక్కడ కండ్లతో ఎవ్వరినో వెదుకుతూ, "ఆయన వెళ్ళిపోయాడు," అన్నది.


"ఎక్కడికి వెళ్ళాడో మీకేమన్నా తెలుసా?"

"వెళ్ళేటప్పుడు నాతో చెప్పి వెళ్ళలేదు" అన్నది

"మీతో చెప్పలేదా?"

"లేదు. ఉదయం లేచి చూచేటప్పటికి ఆయన లేడు. నాతో చెప్పవలసిందని చెప్పి వెళ్ళిపోయారని నౌఖరు చెప్పాడు.

"అతను టెక్ట్సుబుక్కులు పెట్టించుకునే ప్రయత్నంలో ఇక్కడకు వచ్చాడు. అదేమైందో మీకేమన్నా తెలుసా?" అని అడిగాను. అతను వెళ్ళటానికి కారణం ఏమన్నా తెలుస్తుందేమో అనే ఆశకొద్దీ.




"ఆ విషయం ఆయన నాతో చెప్పలేదు. కాని నాకు తెలిసి, ఆయనకు తెలియకుండా ప్రయత్నించాను. కాలేదు. మీ దగ్గర దాపరికం ఎందుకు? ఇతరులు ఏదో అనుకుంటారుగాని, ఇదివరకున్న పలుకుబడి నాకిప్పుడులేదు. ఆయన రెండు సంవత్సరాలముందు వచ్చివుంటే ఎంత సహాయమైనా చెయ్యగలిగి వుందును" అన్నది.

"తన పుస్తకాలు అప్రూవ్ కాలేదని అతనికి తెలిసిందా?"

"తెలిసే అవకాశం లేదు. నాకు కూడా ఆయన వెళ్ళిన పిదప తెలిసింది."

"నాకంతా అగమ్యగోచరంగా వుంది," అన్నాను.

"మీ రొక పని చెయ్యగలరా?" అని ఎంతో మర్యాదగా అడిగింది.

"ఏం పని?"

"గుంటూరులో మీకు తెలిసినవారు వుండకపోరు. వా రెవరికైనా వ్రాసి అసలు గుంటూరు వచ్చారో లేదో కనుక్కోండి."

"తప్పకుండా కనుక్కుంటాను. అయితే వొక సంగతి చెప్పండి అతను గుంటూరు వెళ్ళి వుండడేమో అనే అనుమానం మీ కేమన్నా వుందా?''

"నాకు ప్రత్యేకం అటువంటి అనుమానం ఏమీ లేదు. ఉండటానికి కారణం కూడా లేదు కాని ఆయన స్వభావం చాలా విచిత్రమైంది ఇంతలో వుబ్బిపోతారు. అంతలో తగ్గిపోతారు. ప్రతి చిన్న విషయానికి అమితంగా కంగారు పడతారు అందుకని అకస్మాత్తుగా మనకు తెలియని క్రొత్త నిర్ణయం

ఏదన్నా తీసుకొని ఆ క్రొత్తపనిమీద మరెక్కడికన్నా వెళ్ళారేమో తెలుసుకుందామని గుంటూరు వుత్తరం వ్రాయమన్నాను. అంతకంటే ఏమీ లేదు. ఈ విషయం అడగటానికే మీకు కబురుపెట్టాను. మీకు శ్రమ కలిగించినందుకు క్షమించండి."

"దాన్దేముంది?"

"ఉత్తరం వ్రాస్తారు కదూ?"

"వ్రాస్తాను."

"సమాధానం రాగానే నాకు తెలియజేయండి."

"అలాగే."

"మరి వొస్తాను, హాల్లోవారు నా కోసం యెదురుచూస్తున్నారు" అని చెప్పి వెళ్ళిపోయింది. నేను అలాగే కాసేపు కూర్చున్నాను. సిగరెట్టుతీసి ముట్టించాను. నా కండ్ల ముందు ఏదో మిస్టరీ నవల జరుగుతున్నట్టు అనిపించింది నాకు.

కోటేశ్వరమ్మ శ్రీనివాసరావు విషయంలో ఎందుకు ఇంత ఇంటరెస్టు చూపుతూ వుంది? శ్రీనివాసరావుదగ్గర కొన్ని మంచి గుణాలు వున్నమాట నిజమే. మరీ ఒక్కొక్కప్పుడు పసిపిల్లవానికిమల్లే వుండి పసిపాప నవ్వంత నిర్మలంగా వుండి కొంతమందిని ఇట్టే ఆకర్షిస్తాడు. ఒక్కొక్కప్పుడు అతని మాటలు అతి అమాయకంగానూ, స్వచ్ఛంగానూ వుండి సెలయేటి ముర్మర ధ్వనులకువలె మనస్సును ఆకర్షిస్తాయి. ఒక్కొక్కప్పుడు అతను అతి సామాన్య విషయాలలో మొండిపట్టు పట్టుకొని కూర్చుంటాడు. అటువంటప్పుడు పసిపిల్లవాడు మారాం చేస్తున్నట్లు కనబడి బుజ్జగించబుద్ధి అవుతుంది. అతని కోపంకూడా విచిత్రమైందే. అతనికి యే సందర్భంలో కోపం వస్తుందో, ఏ సందర్భంలో రాదో ముందుగా చెప్పలేం. మనబోటివాళ్ళకు మామూలుగా కోపంవచ్చే విషయాలను అతను నవ్వి వొదిలిపెడతాడు. కోపం బొత్తిగా రానవసరంలేని సందర్భాలలో కోపం తెచ్చుకొని, ఎగిరిపడతారు.

కోపం వచ్చినప్పుడు మాత్రం ఎంత పెద్దవాడినైనా, ఎంత మాటైనా ఇట్టే అనేస్తాడు.

ఈ ప్రపంచం అంతా నా మీదే నడుస్తూ వున్నదనుకుంటున్న బ్రహ్మాండనాయకుణ్ణి పట్టుకొని, 'మీకు బొత్తిగా బుద్ధిలేదండి' అని అనగలడు. చూచిన వారినందరినీ ముగ్ధులను చెయ్యగలిగిన వొక నవమోహనాంగిని పట్టుకొని, 'మీరు మానవజన్మ ఎత్తకపోతే లోకానికి ఏమన్నా నష్టం వచ్చేదంటారా?'

అని అడుగగలడు. మేము కలిసివుంటున్న రోజుల్లో ఒకసారి మినిష్ట రొకరు గుంటూరు వచ్చారు. మినిష్టరు వస్తే జరిగే హంగామా అంతా జరిగింది. అది శ్రీనివాసరావుకి గిట్టినట్లుగా లేదు. సన్మానసభలో మినిష్టరు మాట్లాడుతూ వుండగా, సభికుల్లో కూర్చుని, మినిష్టరుగారి ఉపన్యాసం ఆలకిస్తున్న శ్రీనివాస రావు వొక ప్రశ్న చిన్న కాగితంముక్కమీద వ్రాసి వారికి పంపాడు. మినిష్టరు ఉపన్యాసం చెపుతున్న ఆవేశంలో వుండి, కాగితంలో ఏమున్నదీ కూడా చూచుకోకుండా బిగ్గరగా చదివాడు. ఆ కాగితంలో ఇలా వుంది: 'మినిష్టరు గారూ, వొక చిన్న ప్రశ్న. ఈ మినిష్టరుగిరి పోయింతర్వాత, మీరుకూడా మాకుమల్లే, హోటల్లో అరకప్పు కాఫీ త్రాగి, బావుటా బీడి కాలుస్తూ రోడ్లమీద తిరగవలసిన వారేగదా! నిన్న మొన్నటిదాకా కలిసి మనం ఇటువంటి పనులు చేసినవాళ్ళమే గదా! ఇంతలో ఒకరోజు పొద్దున్నే మాకు నీతులు ఉపదేశించే సామర్థ్యం మీకు ఎక్కడినుంచి వచ్చిందండి?' ఇదీ ఆ చీటీలోవున్న మాటలు.

చీటీలోని మొదటి వాక్యం చదివేటప్పటికి మినిస్టరుగారు ప్రమాదాన్ని పసికట్టి చదవటం ఆపటానికి ప్రయత్నించారు. కాని జనం ఆపనిస్తేనా? 'పూర్తిగా చదవ వలసిందే!' అని పట్టుబట్టి, గోలచేసి మినిస్టరుతో సొంతం చదివించారు. ఇక ఆ రోజు మినిస్టరు నీతులు చెప్పిందీలేదు. ప్రజలు విన్నదీలేదు. పెద్దగోలతో మీటింగు ముగిసింది. ఆ గోలమధ్య "శ్రీనివాసరావుకీ జై" అని నినదించిన వారుకూడా లేకపోలేదు.

అతను చెయ్యాలని చేస్తాడో, అమాయకంగా చేస్తాడో మనం చెప్పలేంగాని, మొత్తానికి ఇటువంటి పనులు చేస్తూవుంటాడు. తాను చేసిన పనులకు అందరూ నవ్వుతుంటే, తాను కదలకుండా బొమ్మల్లే కూర్చుంటాడు. అప్పుడు అతని మనస్సులో మెదిలే ఆలోచనలను తెలుసుకోవటం బ్రహ్మతరంకూడా కాదు. ఆ క్షణం బుద్ధుని విగ్రహంలాగ అతి మనోహరంగా కనబడతాడు

ఇటువంటి గుణాలు చాలా వున్నాయి అతనిలో. అయితే ఈ గుణాలలో, హేతువాదబుద్ధికి అందినంతవరకు, కోటేశ్వరమ్మను ఆకర్షించి అతనిలో ఇష్ట రెస్టు కలిగించే గుణం వొక్కటీలేదు.

కోటేశ్వరమ్మ నవనాగరిక నారీమణి. నవనాగరిక లోకానికి చూడామణిగా విలసిల్లాలని నిత్యం ప్రయత్నించే మనిషి. రెండుచేతులా డబ్బు ఆర్జించటం జీవితంలోవున్న భోగాలను తనివితీరా అనుభవించటం, పదిమంది మెప్పులను పొందటం ఆమె ఆదర్శం. శ్రీనివాసరావు జీవితానికి ఆసరాగావున్న నైతిక విలు

వలంటే ఆమెకు నమ్మకం లేదు. నమ్మకం లేకపోగా ఎగతాళికూడా. ముందుకు తోసుకుపోవటమే ప్రస్తుతం ఆమె అనుసరిస్తున్న విధానం. ఆ వూపులో ఎక్కడి కన్న ప్రశ్నకు తావేలేదు.

ఇటువంటి మనిషికి శ్రీనివాసరావుమీద ఎందుకు ఇన్టరెస్టు కలిగింది. ఇన్టరెస్టు కలిగిన మాటమాత్రం వాస్తవం. ఇన్టరెస్టే కలిగి వుండకపోతే అతని విషయం కనుక్కోటానికి ఆమె ఇంత తాపత్రయపడి వుండేదికాదు. నాబోటివాడు అతని ప్రసక్తి తెచ్చినా ఎరగనట్లు నటించి వుండేది. ఎందుకు అంత ఇన్టరెస్టు కలిగింది? పైగా నాకు తెలిసినంతవరకు అతను ఆడవాళ్ళను ఆకర్షించగల మనిషి కాదు. ఉదయమే లేచి చన్నీళ్ళ స్నానం చేస్తాడు. ఎప్పుడూ ముతకఖద్దరు దుస్తుల్లో వుంటాడు. కుంకుమబొట్టు పెడతాడు. జుట్టుకూడా అటు గిరజాలకూ, ఇటు క్రాపుకీ మధ్యస్త రూపంలో వుంటుంది.

సిగరెట్ మీద సిగరెట్ వెలిగిస్తూ ఆలోచిస్తూ కూర్చున్నాను. టీ పార్టీకి వచ్చిన కేంద్రమంత్రి ఉపన్యసిస్తున్న సంగతికూడా నా గమనంలో లేదు. హాల్లో కరతాళధ్వనులు చెలరేగినై.

* * *

మరునాడు గుంటూరులోవున్న నా మిత్రుని కొక ఉత్తరం వ్రాశాను. శ్రీనివాసరావు గుంటూరులో వున్నదీ లేనిదీ వెంటనే తెలియజెయ్యమని. అతని దగ్గరనుంచి వెంటనే సమాధానం వచ్చింది. శ్రీనివాసరావు గుంటూరులో లేడట. హైద్రాబాద్ వెళ్తున్నానని చెప్పి సుమారు పదిరోజుల క్రిందట బయలుదేరాడట. ఇంకా ఇంటికి తిరిగి రాలేదట.

ఈ విషయం ఆనాడే నౌకరుద్వారా కోటేశ్వరమ్మకు తెలియజేశాను. ఆ నౌకరు ద్వారానే వొకసారి తనను వచ్చి కలువవలసిందని నాకు కబురుచేసింది కోటేశ్వరమ్మ. ఆ సాయంకాలం నేను తీరికచేసుకొని ఆమె యింటికి వెళ్ళాను.

ఆమె ఇల్లు పబ్లిక్‌గార్డెన్స్‌కి దగ్గరలోవుంది. ఆ మధ్యనే పెద్ద స్థలంకొని, అందులో కుటీరంవంటి ముచ్చటయిన ఇల్లు కట్టించింది. మిగిలిన స్థలంలో మంచి మంచి మొక్కలు వేయించింది; అక్కడక్కడా స్ప్రింగ్స్ పెట్టించింది, ఆ ఇంటి ఆవరణలోకి అడుగుపెట్టగానే, ఆ ఇంటి యజమానురాలు మంచి అభిరుచి కలదని స్పష్టపడుతుంది.

నేను వెళ్ళేటప్పటికి ఆమె గదిలో వొక సోఫాలో పడుకొనివుంది. ఆకుపచ్చ




జార్జెట్ చీర కట్టుకొని, అదేరంగు రవికె తొడుగుకొని వుంది. మనిషి చాలా గజిబిజిగావుంది. జుట్టుకూడా దువ్వుకొనిలేదు.

"రండి" అన్నది.

నేను దూరంగావున్న మరొక సోఫాలో కూర్చున్నాను.

"ఇలా కూర్చోండి" అని తనకు దగ్గరగావున్న కుర్చీ చూపింది.

"కాఫీ త్రాగుదురుగాని" అన్నది.

"ఇప్పుడేమీ వొద్దు" అన్నాను.

కాని ఆమె నామాట వినిపించుకోలేదు. నౌఖరుతో కాఫీ పట్టుకురమ్మని చెప్పి, "మీరు కాఫీ త్రాగుతూ వుండండి. నేను క్షణంలో వస్తాను పబ్లిక్ గార్డెన్స్‌కి వెళదాం'' అన్నది.

ఇక నాకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఇంట్లోకి వెళ్ళింది.

నౌఖరు కాఫీ ట్రేలో పట్టుకొనివచ్చి బల్లమీద వుంచాడు. నేను నెమ్మదిగా కాఫీ త్రాగుతూ కూర్చున్నాను.

ఆ గదిలో అమర్చిన ఫర్నిచరూ, గోడలకు వున్న చిత్రాలూ చూచి, కోటేశ్వరమ్మ అభిరుచిని మనస్సులో మెచ్చుకున్నాను. ఆమెకు డబ్బుకుకూడా ఏమీ లోటులేదని నిశ్చయించుకున్నాను.

అంతలో పబ్లిక్‌గార్డెన్స్‌కి వెళ్ళటానికి ముస్తాబై వచ్చింది. ముస్తాబై వచ్చిన ఆమెనుచూచి నేను నిర్విణ్ణుడనయ్యాను. టీ పార్టీలో చూచినప్పుడు వున్న తను

కులు ఇప్పుడామె అలంకరణలో లేవు. మన పూర్వ అలంకరణా వైభవం ఆమెలో దీప్తిచెందింది. బెనారస్ పట్టుచీర కట్టింది. జరీఅంచు జాకెట్ తొడిగింది. నొసట పెద్ద కుంకుమబొట్టు పెట్టింది. మధ్యపాపిటతీసి, జుట్టు ముడివేసి, ముడిచుట్టూ పువ్వులు తురిమింది టీ పార్టీలో కనుపించిన ఆ మూర్తికి ఈ మూర్తికి ఎంత తేడా! ఆ మూర్తి పదును చురకత్తివలె వున్నది. ఈ మూర్తి మంగళహారతివలె వున్నది. ఆ మూర్తి విద్యుల్లతవలె వున్నది. ఈ మూర్తి వెన్నెలవత్తివలె వున్నది.

నిర్ఘాంతపోయి చూస్తున్న నన్ను చూచి ఆమె నవ్వింది. "వెళదాం" అన్నది. ఇద్దరం పబ్లిక్ గార్డెన్స్‌కి నడిచే వెళ్ళాం. ఒక రాతిమీద కూర్చున్నాం. ఎదురుగా లేళ్లూ, దుప్పులూ కనిపిస్తున్నాయి. ప్రక్కన భల్లూకాలున్నాయి. మేము కూర్చున్నరాయి కొలను మెట్లదగ్గరిది. కొలను అంచుల్లో మొసళ్ళు తిరుగుతున్నాయి. వొక ప్రక్క ఖైదులో వున్న కోతులు పేలు చూచుకుంటున్నాయి.

ఆ రోజు పబ్లిక్ గార్డెన్స్ చాలా నిశ్శబ్దంగా వున్నది. జంతువులను చూడటానికి బడిపిల్లలుగానీ పల్లెటూరి స్త్రీలుగానీ రాలేదు.

ఎదురుగా వున్న పచ్చికబయలుమీద వొక ప్రేమికుల జంట కూర్చొని వుంది. కూర్చోవడంలో మైమరచి కూర్చొని వుంది.

ఆమె వున్నట్టు వుండి, హఠాత్తుగా, "శ్రీనివాసరావు ఎక్కడికి వెళ్ళిందీ చెప్పరూ," అని అడిగింది

"నిజంగా నాకు తెలియదు" అన్నాను.

ఆమె వొక్కక్షణం ఆలోచించి, "నన్ను గురించి, మీ కేం చెప్పాడు?" అని అడిగింది.

''మీరంటే అతనికి చాలా అభిమానం. చాలా గొప్పగా చెప్పాడు'' అన్నాను.

ఆమె ఒక్క నిట్టూర్పు విడిచి వూరుకుంది.

"ఏదో పనిమీద వెళ్ళివుంటాడు. ఎందుకు అతను వెళ్ళిపోవటాన్ని గురించి మీరింత ఆతురత పడుతున్నారో నాకు అర్థంకాకుండా వుంది" అన్నాను.

"ఆయన ఈ జనాన్ని వదిలిపెట్టి యే మహారణ్యాలలోకో, ఏ పర్వత సానువులలోకో వెళ్ళిపోయి వుంటాడని నా అనుమానం" అన్నదామె

హాస్యం ఆడుతున్నదో, నిజంగా మాట్లాడుతున్నదో అర్థంకాక ఆమె ముఖం ఒక్క క్షణం పరిశీలనగా చూశాను ఆమె నిజంగా తాను నమ్మిన మాటలనే

అంటున్నదనిపించి "యీ వెళ్ళిపోవడానికి కారణం ఏమిటంటారు?" అని అడిగాను.

"ఆయన నన్నొక దేవతగా ఊహించుకొని వుంటాడు. కాదని తెలిసి ఆశాభంగం చెంది, భరించలేక వెళ్ళిపోయి వుంటాడు. అందుకనే ఆయన గుంటూరు వెళ్ళివుండరని నాకు అనుమానం కలిగింది. నా అనుమానం నిజమే అయింది" అన్నది.

ఆమె మాటలకు నేనేం బదులు చెప్పగలను? వింటూ కూర్చున్నాను.

"మీ కొక సంగతి చెపుతాను. అ సంగతి చెప్పటానికే మిమ్ములను రమ్మన్నాను. మీరు నన్ను అపార్థం చేసుకోవద్దు'' అన్నది.

"చెప్పండి"

"నేను శ్రీనివాసరావుగారిని ప్రేమిస్తున్నాను. యింత జీవితం చూచిన నాకు ప్రేమ ఏమిటా అని మీరు ఆశ్చర్యపడ నవసరంలేదు. నన్ను చూచుకుంటే నాకే ఆశ్చర్యంవేస్తూవుంది. కాని హృదయ పూర్వకంగా ప్రేమిస్తున్న మాట నిజం. ఈ ప్రేమ ఇప్పటిది కాదు. ఆయనను గుంటూరులో మొదటిసారి చూచినప్పుడే కలిగింది. అందుకనే హైద్రాబాద్ రావలసిందనీ, మా ఇంట్లో దిగవలసిందనీ ఆహ్వానించాను. అలాగే వారు వచ్చారు. కాని దురదృష్టవశాత్తూ నన్ను దేవతగా పూజించటం మొదలు పెట్టారు...'' అన్నది.

తదేక ధ్యానంగా వింటున్న నన్ను చూచి, "పూజించేవారు పూజిస్తే మాత్రం అస్తమానం దేవతలాగు నటించటం కష్టం కాదుటండీ?" అని అడిగింది.

సమాధానం చెప్పక తప్పక, ''ఒక విధంగా కష్టమే" అన్నాను నేను.

"నేను దేవతనేమిటి, నా మొహం" అని అప్పుడప్పుడూ అంటూనే వుండేదాన్ని. దానికి ఆయన 'దేవతలకు తాము దేవతలమని తెలియదు. ఆ సంగతి మనుష్యులకు తెలుస్తుంది' అనేవారు. ఇక ఆ మనిషికి ఏం చెప్పగలం? ఒక రోజు..." అంతవరకు చెప్పి ఏమనుకున్నదో ఆపివేసింది. ఆమె చెపుతుందని నేను కొంచెంసేపు మౌనంగా కూర్చున్నాను. కాని చెప్పలేదు.

చివరికి, "తరువాత యేం జరిగింది?" అని నేనే అడిగాను.

"జరగటానికి ఏముందిలెండి?" అన్నది.

ఆమె ధోరణినిబట్టి ఇక ఆమె చెప్పదలుచుకోలేదని నిశ్చయించుకున్నాను.

''అయితే మీరు మాత్రం నా కొక పని చేసిపెట్టాలని ప్రార్థిస్తున్నాను. వారు

కనిపిస్తే తప్పకుండా నా దగ్గరకు పంపండి. అవుసరమైతే మీరు వెంటపెట్టు కొని తీసుకురండి'' అన్నది.

"అలాగే" అన్నాను.

ప్రక్కన వున్న కోతులు కిచకిచ లాడుతున్నాయి. ఎదురుగావున్న లేళ్ళు, దుప్పులూ చెంగుచెంగున దూకుతున్నాయి. పచ్చికబయలుమీద కూర్చున్న ప్రేమికులు ఒకరి నొకరు చూసుకుంటున్నారు, నవ్వుకుంటున్నారు. మళ్ళీ చూసుకుంటున్నారు, మళ్ళీ నవ్వుకుంటున్నారు.

వాళ్ళను ఆమె గమనించినట్లుంది. "ఈ ప్రేమ ఎంత విచిత్రమైంది" అని ఒక్క నిట్టూర్పు విడిచింది.

* * *

మేము ఇంటికి తిరిగివచ్చేటప్పటికి రాత్రి తొమ్మిది గంటలైంది. అంటే అప్పటివరకూ మేము పబ్లిక్ గార్డెన్స్‌లో లేము. తనతోపాటే కాఫీ త్రాగవల సిందని ఆమె కోరగా టాక్సీ వేసుకొని సికింద్రాబాద్‌లో ఒక పెద్ద హోటలుకి వెళ్ళాం. అక్కడి వాళ్ళంతా ఆమెను చాలా గౌరవించారు. ఆమె వారికి చిరపరి చితురాలులాగ వుంది.

"మీ రేమన్నా తీసుకుంటారా?" అడిగింది.

ఆ ప్రశ్నకు సరైన అర్థం నాకు మొదట్లో తెలియలేదు. తరువాత ఆమె మద్యం సేవించటాన్ని గురించి అడుగుతూ వుందని, "నాకు అలవాటు లేదు. పుచ్చుకోవాలని వుంటే మీరు పుచ్చుకోండి. నాకు అభ్యంతరం లేదు" అన్నాను.

"వొకప్పుడు పుచ్చుకొనేదాన్ని. ఇటీవల మానివేశాను" అన్నది.

ఎందుకనో కాని "ఎప్పట్నుంచీ?" అని అడగబుద్ధి అయింది నాకు, అడి గాను.

''ఆమె చిరునవ్వునవ్వుతూ, "మీ మిత్రునితో స్నేహం అయినప్పటినుంచి" అన్నది.

ఇద్దరం కాఫీ తాగాం, బిస్కట్లు తిన్నాం. టాక్సీవేసుకొని తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి తొమ్మిది గంటలయింది. టాక్సీకి నేను డబ్బు ఇవ్వబోతే ఇవ్వ నివ్వలేదు. తానే ఇచ్చిపంపింది.

''ఇక నేను వెళ్ళివస్తాను'' అన్నాను.

"కాసేపు కూర్చొని వెళుదురుగాని" అని చెప్పి నన్ను లోపలకు తీసుకు వెళ్ళింది. ఆమె ఎంత వొంటరితనం అనుభవిస్తూవుందో యిప్పుడు నాకు అర్థ




మైంది. నౌఖరు ఎక్కడో పడుకొని నిద్రపోతున్నాడు లైట్లు వేసేవాళ్ళుకూడా లేరు. ఇల్లు అతి నిశ్శబ్దంగా వుండి, భయం కొల్పుతూవుంది. ఆమె లైటు వేసే టప్పటికి వొక్కసారిగా కండ్లు జిగేల్‌మన్నాయి. ఆ కాంతిలో ఆ ఇల్లువున్న దానికంటే పెద్దదిగా కనుపించింది. ఆ యింట్లో ఆమె వొక్కత్తే యెలా వుంటూవుందా అనిపించింది.

ఆమె నా భావాలను గ్రహించినట్లుంది. ''నేను ఎంత ఏకాంత జీవితం గడుపుతున్నానో యిప్పుడు మీకు అర్థమై వుంటుంది" అన్నది. అప్రయత్నంగా ఆమె కన్నులు జలమయమైనై.

"ఒక్కొక్కప్పుడు ఈ ఏకాంత జీవితాన్ని మరచిపోవటానికే నేను విచ్చలవిడిగా తిరుగుతున్నానా అని అనిపిస్తూంటుంది నాకు'' అన్నది. నా కీ జీవితం మీద పూర్తిగా విసుగు పుట్టింది"-అన్నది. కన్నీరు బొటబొట కార్చింది.

నాకు ఆమెను ఓదార్చాలనిపించింది. కాని యెలా వోదార్చగలను? స్తబ్ధుడనయి కూర్చున్నాను.

ఆమె కన్నీరు తడుచుకుంటూ ''ఒకసారి లోపలికి రండి?" అన్నది.

నేనామెను ప్రక్కగదిలోనికి అనుసరించాను. ఆ గదిలోవున్న ఒక ఫోటో దగ్గరకు నన్నామె తీసుకువెళ్ళింది. ఆ ఫోటో ఒక రైతుది. మంచి ఆరోగ్యంగా వున్నాడు. నిర్మలమైన ముఖం, ప్రశాంతతను వెదలుగక్కుతున్న చూపులు,

ఫోటో నుట్టూ పూలమాల వేసివుంది. ముఖానవున్నట్లు అద్దంమీద కుంకుమబొట్టు పెట్టి వుంది.

"ఈ ఫోటో నా భర్తది" అన్నదామె.

నాకు శ్రీనివాసరావు చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చినయి. అప్పు డతని మాటలు నేను నమ్మలేదు. పైగా కోటేశ్వరమ్మ అతని కేవో మాయమాటలు చెప్పి మోసపుచ్చిందనుకున్నాను. ఇప్పుడు ఆమె చెప్పినా నమ్మటానికి సిద్ధంగా వున్నాను.

"ఈయన ఎంతో దొడ్డవాడు. నా బోటిది నమ్మలేనంత క్షమాబుద్ధి గలవాడు. నిరంతరం నా శ్రేయస్సునే కాంక్షించేవాడు. అటువంటి ఈయన్ని నేను విడిచి పెట్టాను. ఎందుకో తెలుసా? భోగాలకు దాసుడు కాదనీ, భగవంతుడు ఇచ్చిన దానితో తృప్తిపడతాడని. ఆయన అప్పుడే అన్నాడు. 'ఎందు కే హాయిగా వెళ్ల మారే బ్రతుకుని రచ్చకు యీడ్చుకుంటావు' అని. కాని నే నాయన మాటలు వినలేదు. ఏదో స్వేచ్ఛను అనుభవిద్దామనుకున్నాను. లోకంలో వున్న భోగాల నన్నిటినీ అంకంలోకి తెచ్చుకుందామనుకున్నాను. పర్యవసానం ఈ ఏకాకి బ్రతుకు బ్రతకటం. ఎందుకు బ్రతుకుతున్నదీ తెలియదు. ఎవ్వరికోసం బ్రతుకు తున్నదీ తెలియదు. బ్రతుకుమీద నిరాశ జనించినప్పుడల్లా ఈ ఫోటో దగ్గరకు వచ్చి, ఆయన నిర్మలమైన ముఖంలోకి ఒక్కసారి చూస్తాను. మనస్సుకి కాస్త ప్రశాంతత చిక్కుతుంది. నన్ను అర్థంచేసుకొని ఎంతో సానుభూతితో దయతో చూస్తున్నట్లు వుంటుంది ఆ ముఖం..."

"ఆయన వున్నారా?'' అని అడిగాను.

"లేకేం?"

''ఇక్కడకు వస్తుంటారా?''

"మొదట్లో వచ్చి కష్టం సుఖం కనుక్కొని వెళ్తుండేవారు. కాని ఇప్పుడున్న వారి భార్యకు వారు నా దగ్గరకు రావటం ఇష్టం వుండేదికాదు. ఆయన జీవితా నికి లేనిపోయిన ఒడుదుడుకులు తెచ్చిపెట్టటం ఎందుకని నేనే రావద్దన్నాను. అప్పటినుంచి వారు రావటం లేదు కాని వారు ఎక్కడున్నా నా శ్రేయస్సును కాంక్షిస్తూ వుంటారనే నమ్మకం నాకుంది. వారి స్వభావం అటువంటిది. అటు వంటి స్వభావమే శ్రీనివాసరావుగారిదీని అందుకని వారికి చూడగానే యిట్టే ఆకర్షించబడ్డాను. వారిని ఆకర్షించటానికి కొన్ని అబద్ధాలు కూడా చెప్పాను.

వారు నేను చెప్పిన ప్రతి అక్షరం నమ్మారు. కానీ తీరా నా మనస్సులోని ప్రేమను ప్రకటించేటప్పటికి తబ్బిబ్బుపడి వొదిలి వెళ్ళారు" అన్నది.

''అతని విషయం మీ రింతగా ఆలోచించటం మంచి పని కాదనుకుంటాను" అన్నాను ధైర్యంచేసి.

"యెందుకని?''

"అతను ఇటువంటి వ్యవహారాలకు విముఖుడు. పైగా భార్యాపిల్లలు గంపెడు. సంసారం గలవాడు."

"సంసారం లేనివా రెవరున్నారు? నేను ఒకదాన్ని తప్ప" అని పక్కమీద పడి కన్నీరు మున్నీరుగా యేడ్చింది. కాసేపటికి ఏడుపు మానింది అలాగే సొమ్మసిల్లి నిద్రపోయిందేమో అనుకున్నాను.

నేను అలా అనుకుంటూ వుండగానే లేచి జుట్టుసర్దుకుంటూ, "నన్నేదో పిశాచం ఆవహించినట్లువుంది. లేకపోతే ఇంతకుముందు ఎవ్వరి దగ్గరా నా గొడవలు చెప్పుకోనిదాన్ని మీతో ఎందుకు చెప్పుకుంటాను? ఇక మీరు వెళ్ళండి. మీకు లేనిపోని శ్రమ ఇచ్చాను" అన్నది.

నేను నెమ్మదిగా లేచి బయటకు వచ్చివేశాను. బయట పిండి ఆరబోసినట్లు వెన్నెల కాస్తూవుంది. చల్లని గాలి వీస్తూవుంది వాతావరణం చాలా ప్రశాంతంగా వుంది. కొద్ది రిక్షాలు మాత్రమే అటూ యిటూ తిరుగుతున్నాయి. నా మనస్సును ఎనలేని విచారం క్రమ్ముకొనివుంది పైకి అంత చక్కగా కనపడిన కోటేశ్వరమ్మ ఇల్లు ఒక భూతగృహమేమో అనిపించింది. ఆ ఇంటి ఒంటరితనం అగ్ని జ్వాలలవలె రేగి ఆలోచించుతున్నకొద్దీ కసిరికొట్టింది. అకస్మాత్తుగా ఆ ఒంటరి తనాన్ని భరించలేక కోటేశ్వరమ్మ యెప్పుడో ఒకప్పుడు ఆత్మహత్య చేసుకోక పోదని అనిపించింది. ఆ ఊహతో శరీరం గడగడ వణికింది. ఎటుచూచినా టాక్సీ కనపడలేదు. రిక్షాలో కూర్చొని ఇంటికి బయలుదేరాను.

ఇది జరిగిన కొద్దిరోజులవరకూ నాకూ మళ్ళీ కోటేశ్వరమ్మ కనిపించలేదు. శ్రీనివాసరావు సంగతి తెలియలేదు. అంతలో నాకు అనంతపురం ట్రాన్స్‌ఫర్ వచ్చింది. సంవత్సరం మధ్య కదిలిస్తే పిల్లల చదువు చెడుతుందని కుటుంబం హైదరాబాద్‌లోనే వుంచి నేను అనంతపూర్ వెళ్ళి డ్యూటీలో జాయిన్ అయ్యాను. నా కష్టసుఖాలు చెప్పుకొని మళ్ళీ తొందరలోనే హైదరాబాద్ వేయించుకోవాలనే ఆశకూడా ఒకటి వుంది. ఇదిగో అదిగో అంటూనే అధికారులు సంవత్సరం రోజులు గడిపారు. నాకు విసుగుపుట్టి, సెలవుపెట్టి హైదరాబాద్ వచ్చాను.


మా ఇంట్లో వాళ్ళకి భగవద్భక్తి కొంచెం ఎక్కువ. పూజలూ, పునస్కారాలూ, వ్రతాలు, ఉపవాసాలుచేస్తూ వుంటారు. హైదరాబాద్‌కి ఇరవై ముప్పైమైళ్ళ దూరంలో యాదగిరిగుట్ట అనే పుణ్యక్షేత్రం వుంది. ఆ క్షేత్రం తెలంగాణాలో చాలా ప్రసిద్ధికెక్కినది. ఆ స్వామి భక్తత్రాణపరాయణుడని ప్రతీతి. అక్కడ ప్రతిఏడూ అతివైభవంగా ఉత్సవాలు జరుగుతుంటై. ఆ ఉత్సవాలకు ఎక్కడెక్కడనుంచో ప్రజలు బండ్లుకట్టుకొని అనేక కష్టాలకువోర్చి వస్తుంటారు. అప్పుడా దేవాలయోత్సవాలు జరుగుతున్న రోజులు. ఈసారి ఒక గొప్ప స్వాములవారు ఆ కొండమీద వేంచేసి వున్నారనీ, అటు దేవుని దర్శనం చేసుకోవచ్చు, యిటు స్వాములవారినీ చూడవచ్చు గనుక తీసుకువెళ్ళవలసిందనీ కోరింది

ఆమె ఎక్కువ కోరికలు కోరే మనిషికాదు. నాకు సెలవులు అన్నప్పుడూ దొరకవు ఇప్పుడీ రెండూ కలిసివచ్చినై. ఇంతకంటే మంచి అదును దొరకదని నేను అంగీకరించాను.

నా భార్యా, నేనూ, పిల్లలూ-అందరం యాదగిరిగుట్ట బయలుదేరాం. ఋష్యశృంగుని సంతతివాడైన యాదవ మహర్షి దుర్గమారణ్యంగావున్న ఈ ప్రదేశంలో తపస్సుచేశాడనీ, ఆయన తపస్సుకు మెచ్చి, నృసింహస్వామి యిక్కడ ఆయనకు ప్రత్యక్షమైనాడనీ ప్రతీతి. అందువల్ల ఈ ప్రదేశాన్ని పరమ పూజ్యంగా భావిస్తారు ప్రజలు.

అసలే ఆ కొండనెక్కే మార్గం సుగమమైంది కాదు. ఆ రోజు జనసమర్దం మరీ ఎక్కువగా వుండటంవల్ల కొండ ఎక్కటం మాకు కష్టమే అయింది. కొండపైన కోలాహలం మరీ ఎక్కువగా ఉంది. భజనలతో, హరికథలతో, వేదపఠనంతో, యాత్రికుల కేకలతో కొండ పిక్కటిల్లుతూవుంది అక్కడ యాత్రికులకు మంచి వసతులున్నాయి. మేము ఒక వసతి గృహం ప్రత్యేకం అద్దెకు తీసుకొని అందులో మకాంపెట్టాం. స్నానసంధ్యాదులు తీర్చుకొని స్వామి దర్శనార్థం బయలుదేరాం. స్వామివారి విగ్రహం ఒక గుహలోవుంది. వారిని దర్శించుకొని, తిరుగవస్తూండగా అచల పరిపూర్ణులైన బ్రహ్మానందస్వాములవారి ప్రసక్తి యెవరో తెచ్చారు. వారు శిష్యపరమాణువులతో దగ్గరలోనే వేంచేసి వున్నారని చెప్పారు. మేమంతా వారి దర్శనార్థం వెళ్ళాం

వారు నా కండ్లకు సిద్ధస్వరూపులుగానే కనిపించినారు. వారి చుట్టూ భక్తులూ, శిష్యులూ పరివేష్టించి తన్మయత్వముతో భజనలు చేస్తున్నారు,




హఠాత్తుగా స్వాములవారి చెంతకూర్చుని పరవశత్వముతో భజననడుపుతున్న ఒక శిష్యునిమీదకు దృష్టిమళ్ళింది. అతనిని ఎక్కడో చూచినట్లనిపించి తదేక ధ్యానంతో పరికించాను. అతను శ్రీనివాసరావు అనే విషయం తటుక్కున తట్టింది. అతను కాషాయాంబరాలైతే ధరించలేదుగాని, కేశఖండనం చేయించుకొని వున్నాడు. అందువల్లే వెంటనే గుర్తుపట్టలేదు.

అతన్ని చూచేటప్పటికి నా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. అతను యెప్పుడు జేరా డీ స్వాములవారి శిష్యవర్గంలో? ఈ భజనలేమిటి? ఈ అవతారం ఏమిటి? పైగా అతని వైఖరిచూస్తే స్వాములవారి ప్రధాన శిష్యులలో ఒకడుగా కనుపిస్తున్నాడు. మైమరచి అందరితోపాటు తనూ కీర్తనలు పాడుతున్నాడు. వచ్చినవారికి స్వాములవారి దర్శనం ఇప్పిస్తున్నాడు. వారి పాదధూళి పంచి పెడుతున్నాడు ఈ స్వామి భక్తిభావాన్ని పట్టుకొని అల్లుకుపోతున్నాడని గ్రహించాను. యెక్కడ ఆగుతాడో ఆ పరమాత్మకే తెలియాలి.

స్వాములవారి దర్శన క్రతువు పూర్తవగానే నా భార్యనూ పిల్లలనూ వసతి గృహానికి పంపి నేను అతనితో మాట్లాడాలనే ఉద్దేశంతో తిరిగివచ్చాను. అప్పటికి స్వాములవారు తమకు ప్రత్యేకం నిర్దేశించబడిన గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ గదిముందు నిలబడి భక్తులు వారి విశ్రాంతికి భంగంకలిగించకుండా కాపాడే ప్రయత్నంలో వున్నాడు శ్రీనివాసరావు

నన్ను చూడగానే ఒక్క క్షణం తటపటాయించి "నువ్వు వచ్చావా? మంచి పని చేశావు" అన్నాడు.

"నువ్వి స్వాములవారితో యెన్నాళ్ళనుంచి వుంటున్నావు?"

"వారి ఆశ్రమంలో జేరి సంవత్సర మయింది."

"ఇక వారితో ఉండిపోదలిచావా?"

ఈ నా ప్రశ్నకు అతను చిరునవ్వు నవ్వి, "ఈ మహదానందాన్ని ఒక్కసారి రుచిమాచినవాడు విడిచిపెడతాడా, పిచ్చివాడా?" అన్నాడు.

అతనికి స్వాములవారి శుశ్రూషతోపాటు ఆధ్యాత్మికపరుల పదాడంబరం కూడా పట్టుబడినందుకు విచారించి "ఈ సంగతి ఇంటికి తెలియజేశావా?" అని అడిగాను.

"ఎక్కడ ఉంటున్నదీ తెలియజెయ్యలేదుగాని, ఆశ్రమంలో జేరుతున్నాననీ, ఇక నా మీద ఎటువంటి భ్రమలూ పెట్టుకోవద్దనీ వ్రాశాను."

వెంటనే ఇంటిదగ్గర అతని భార్యాపిల్లలూ పడే వేదన నాకు గుర్తుకువచ్చి నాకు మనస్సు చికాకుపడింది. తమమీద ఆధారపడిన వారి మనస్సులలో చిచ్చును రగిలించి వీరు బావుకుతినేదేమిటో?

"నువ్వు డబ్బు వెనకవేసినవాడివికావు. వారి గతేంకాను!" అని అడిగాను.

"అన్నిటికీ ఆ పరాత్పరుడే వున్నాడు" అని చేతులు పైకెత్తి ఆకాశాన్ని చూపుతూ సమాధానం చెప్పాడు.

"అన్ని విషయాలకుమల్లె ఈ విషయంలోకూడా నువ్వు తొందరపడుతున్నావనీ, చివరికి పశ్చాత్తాపపడవలసి వస్తుందని నేను అనుకుంటున్నాను."

నా మాటలు అతని చెవికి మాయాజాలంలోపడి తన్నుకుంటున్న వొక అజ్ఞాని ప్రలాపంగా వినిపించివుంటై. నన్ను జాలిగాచూచి, "భగవంతుని సేవకు తొందరపడటం మంచిదే గద" అన్నాడు.

అంతలో గదిలోంచి "భక్తానందా?" అనే పిలుపు వినవచ్చింది.

"అయ్యా" అని సమాధానం చెప్పి, "స్వాములవారి పిలుపైంది. వెళ్ళివస్తాను" అన్నాడు.

"ఇక్కడ ఎన్నాళ్ళుంటారు."

"ఈ ఉత్సవాలు జరిగే వారంరోజులూ వుంటాం."

"ఒకసారి వీలుచూచుకోని హైదరాబాద్ రాగూడదా?"

"వలనుపడదు. ఇక్కడ ఉన్నంతకాలం స్వాములవారి బాధ్యత పూర్తిగా

నామీదనే వుంది. ఇక్కడినుంచి సరాసరి ఆశ్రమానికి వెళ్ళిపోతాం" అని చెప్పి గదిలోనికి వెళ్ళిపోయాడు శ్రీనివాసరావు. ఇక అతనితో యేం మాట్లాడీ ప్రయోజనం లేదని నేను గ్రహించాను ఆలోచించగా అతను కేశఖండనమైతే చేయించాడు గాని, కాషాయాంబరాలు యెందుకు ధరించలేదా అనే అనుమానం వచ్చింది. ఆ అనుమానం పిచ్చి అనుమానమే. ఆ అనుమానంలో ఇంకా వెంకెతనం కూడా వుండి ఉండవచ్చు.

అటుగా వెళుతున్న స్వాములవారి మరొక శిష్యుణ్ని పిలిచి అడిగాను. "వారికింకా స్వాములవారు దీక్ష ఇవ్వలేదు. వచ్చే సంవత్సరం యిస్తారని అనుకుంటున్నారు. దీక్ష పుచ్చుకుంటేతప్ప కాషాయాంబరాలు ధరించే హక్కు యెవ్వరికీ వుండదు" అన్నాడా శిష్యుడు.

కాబట్టి ఇంకొక సంవత్సరానికల్లా శ్రీనివాసరావు, కాషాయాంబరాలలో భక్తానంద్‌గా ప్రసిద్ధి చెందుతాడు: యెందుకనోగాని ఈ భావం నా మనస్సును చాలా కష్టపెట్టింది. అతనితో మాట్లాడాలనుకున్నప్పుడు కోటేశ్వరమ్మ సంగతికూడా అతనికి చెపుదామనుకున్నాను. ఏం చెప్పటానికైనా అతనీ లోకంలో వుంటేగద.

తిరుగు ప్రయాణం చేస్తున్నంతసేపూ నా మనస్సంతా శ్రీనివాసరావుతోనే నిండివుంది. అతనిని నా మనస్సులో భరించలేకపోయాను: అతని సంగతి కోటేశ్వరమ్మ సంగతి మినహాయించి, నా భార్యతో చెప్పాను.

ఆమె శ్రద్ధగా విని, "ఎవ్వరి నొసట యేమి వ్రాసిపెట్టివుందో మనమేం చెప్పగలం?" అన్నది.

"ఎంత తేలిగ్గా కొట్టేశావ్" అన్నాను కొంచెం విసుగ్గా

"నేను అన్నదాంట్లో తప్పేముంది?"

"ఒకవేళ నేనే మిమ్మల్నందరినీ విడిచిపెట్టి స్వాములవారి దగ్గర జేరాననుకో! అప్పుడింత తేలిగ్గా మాట్లాడేదానవా? మనస్సుకు యెంత కష్టంగా వుంటుంది?"

"కష్టంగానే వుంటుంది. కాని తీరా జేరిన తర్వాత చేసేది యేమున్నది?" అన్నది.

ఈ విషయాన్ని ఆమె ఇంత తేలికగా తోసివెయ్యటం నాకు కొంత ఆశాభంగాన్ని కలిగించినమాట వాస్తవం. ఆమె సహజంగా ఆర్ద్రహృదయం గలది. శ్రీనివాసరావు భార్యనీ పిల్లలనూ తలచుకొని చాలా విచారపడుతుందనుకున్నాను. ఈ ఆడవాళ్ళతో వొచ్చిన చిక్కే ఇది. చిన్న చిన్న విషయాలకు

తాము మధనపడతారు. ఇతరులను వ్యధపెడతారు. భగవంతుడు ఆడవాళ్ళను ఈ విధంగా యెందుకు సృష్టించాడా అని ఆలోచిస్తూ కారు నడుపుతున్నాను.

ఎదురుగా వొక కారు వస్తూవుంది. నా ఆలోచనలలో నేను వుండి, ఆ కారు నడుపుతూ వున్న దెవ్వరో నేను గుర్తించలేదు ఆ కారు మా కారు ప్రక్కకువచ్చి సడెన్ బ్రేకులు పడటంతో ఆగిపోయింది. ఎవ్వరా అని చూద్దునుగాదా కోటేశ్వరమ్మ! ఆమె వొక్కతే కారు డ్రయివుచేసుకు వెళ్తూంది. నన్ను గుర్తుపట్టి ఆపింది.

"యాదగిరిగుట్టనుంచేనా?" అని అడిగింది.

అవునన్నట్లు తల ఊపాను నేను.

"నేనూ అక్కడికే వెళుతున్నాను. చాలా మహత్యం గలిగిన స్వాములవారు ఎవ్వరో వొచ్చారని తెలిసింది. వారి దర్శనం చేసుకువద్దామని బయలుదేరాను" అని చెప్పి, నా భార్యనూ పిల్లలనూ పలకరించి కారు స్టార్ట్‌చేసుకొని వెళ్ళిపోయింది.


నాకు మతిపోయినంత పనైంది. అక్కడ కోటేశ్వరమ్మకు కనపడకపోదు. కనపడితే ఆమె మాట్లాడించక వూరుకోదు. అప్పుడు దూదిగుట్టలో నిప్పురవ్వ పడ్డ సామెత కావచ్చు యెంత రసాభాసం అవుతుందో యేమో! ఆమె కారులో తిరిగి యాదగిరిగుట్ట వెళ్ళితే బాగుండేది అనిపించింది నాకు. కాని నా కారు ఇంటికి నడుపుకువెళ్ళేది ఎవ్వరు? వొక్కక్షణం కారు త్రిప్పుకువెళ్దాం అనిపించింది. కాని నా భార్యకు ఏమి కారణం చెప్పగలను? అలాగే కారు నడుపుకు వెళ్ళాను హైదరాబాద్.

* * *

రెండు రోజులు గడిచినై. సంగతులు తెలుసుకుందామని ప్రతిరోజూ నేను కోటేశ్వరమ్మ ఇంటికి కబురుపంపుతూనే వున్నాను కాని ఎప్పటికప్పుడు ఆమె ఇంట్లోలేదనే వర్తమానం వొస్తూవుండేది

మూడవరోజు నా ట్రాన్స్‌ఫర్ విషయం యెంతవరకు వొచ్చిందో తెలుసుకుందామని మా హెడ్ ఆఫీసుకు బయలుదేరాను. నేను మా ఇంట్లోనుంచి బయటకు అడుగుపెట్టేసరికి ఎదురుగా శ్రీనివాసరావు రావటం చూశాను. అతని ముఖవైఖరిచూచి ఏదో కొంప మునిగిందే అనుకున్నాను. ఒస్తూనే "నువ్వే నన్ను రక్షించాలి" అన్నాడు.

"ఏం జరిగింది?" అని అడిగాను.




"ఆమె యాదగిరిగుట్ట వొచ్చింది. ఇప్పు డక్కడేవుంది'' అన్నాడు.

"నీతో ఏమన్నా మాటాడిందా?''

"లేదు."

"మరి నీ కెందుకు ఈ కంగారు?"

"ఈ రెండురోజులనుంచీ అక్కడేవుంది. ఇక స్వాములవారితోనే ఉండిపో తుందట."

"ఉండనియ్, నీకుమల్లేనే ఆమెకూ స్వాములవారి సమక్షంలో చిత్తశాంతి లభించేదేమో!"

''చిత్తశాంతికాదు, పాడూకాదు. నన్ను క్షోభపెట్టటానికే వచ్చింది."

"అలా అని నువ్వెందు కనుకోవాలి?"

"నీకు తెలియదు ఆమె సంగతి," అన్నాడు శ్రీనివాసరావు. "నాకు అక్కడ స్థానంలేకుండా చెయ్యటానికే ఆమె అక్కడకు జేరింది. జేరీజేరగానే ఆశ్రమానికి వెయ్యి రూపాయలు దానం చేసింది. ఇప్పుడు స్వాములవారికి కావలసిన పను లన్నీ ఆమే చూస్తూంది. మా అందరిమీదా ఆమె అధికారిణి అయింది ఇప్పుడు ఏ శిష్యునినోట, ఏ భక్తునినోట విందామన్నా ఆమె పేరే వినబడుతూవుంది."

నిజం చెప్పొద్దూ, అతని మాటలకు నాకు చిరాకు కలిగింది. "నీ సంగతి నాకేం బాగాలేదు శ్రీనివాసరావ్. ఆమెకు భయపడి పారిపోవటం ఏమిటి? వెళ్ళి సరాసరి స్వాములవారి దగ్గర జేరటం యేమిటి? ఆమె వచ్చిందనిచెప్పి మళ్ళీ ఈ కంగారేమిటి? నాకు నీ సంగతేమీ అర్థంకావటంలేదు" అన్నాను. కొంచెం గట్టి గానే అన్నాను

నేను గట్టిగా మాట్లాడేటప్పటికి, అతని మనస్సుకు కష్టంవేసినట్లుంది. కండ్లు చెమ్మగిల్లినై కూడా. జరిగిందంతా ముందే నీకు చెప్పకపోవటం నాదే తప్పు అన్నాడు. చెప్పటానికి అప్పుడు నాకు మొహంచెల్లలేదు. చెప్పివుంటే నువ్వు న న్నీవిధంగా అపార్థం చేసుకునేవాడివి కాదు."

"అప్పుడు కాకపోతే ఇప్పుడు చెప్పకూడదా? నేను నీ స్నేహితుణ్ని. నావల్ల అయ్యే సహాయం చెయ్యటానికి నేను ఎప్పుడూ సిద్ధమే. అయితే అసలు విషయ మేమిటో తెలియకుండా నేనేం చెప్పగలను" అన్నాను.

"ఇంట్లోకి పద చెపుతాను" అన్నాడు.

అప్పటిదాకా మిత్రుణ్ణి గడపలో నుంచోబెట్టే మాట్లాడుతున్నానని స్ఫురణకు వచ్చి నొచ్చుకున్నాను. అతనిని నేను చదువుకునే గదిలోకి తీసుకువెళ్ళి కూర్చో బెట్టాను. అతని మాటలు నా భార్య ఎక్కడ వింటుందో అని లోపలి తలుపువేసి వచ్చి కూర్చున్నాను.

"నేను నీకు కనపడినరోజు జ్ఞాపకం వుందనుకుంటాను. మరునాడు భోజనా నికి రమ్మని న న్నాహ్వానించావు" అని ప్రారంభించాడతను.

"జ్ఞాపకం లేకేం, వున్నది"

"ఆ సమయానికి కోటేశ్వరమ్మపట్ల నాకున్న అభిప్రాయాలుకూడా నీకు తెలిసినవే.''

"కాని ఆ రాత్రి నా జీవితాన్నే మార్చివేసిన సంఘటన ఒకటి జరిగింది. ఆమెతో కాసేపు మాటాడి, ప్రొద్దుపోవటంవల్ల పండుకుందామని నా గదిలోకి వెళ్ళాను. లైటు ఆర్పివేసి పడుకున్నాను. పగలల్లా తిరిగి తిరిగి అలసివున్నా నేమో ఇట్టే నిద్రపట్టింది. ఏ అర్ధరాత్రివేళో మెలకువ వచ్చింది. ఎవ్వరో నా ప్రక్కన పడుకున్నట్లు అనిపించింది. చెయ్యి మీదవేసినట్లుగాకూడా వుంది. తాకి చూశాను. మెత్తగా తగిలింది. నా ప్రక్కన పడుకున్న మనిషి నెమ్మదిగా ఏడుస్తున్నట్లుగాకూడా వినిపించింది అకస్మాత్తుగా ఆమె కోటేశ్వరమ్మ పని మనిషేమో అని కంపరంపుట్టింది. అది నేను అటూ ఇటూ తిరుగుతున్నప్పుడల్లా నన్ను వింతగా చూస్తూ వుంటుంది. రాత్రిళ్ళు అప్పుడప్పుడూ కోటేశ్వరమ్మకు తోడుగా ఆ ఇంట్లోనే పడుకుంటూ వుండేది.

"ఎవరు?" అని గద్దించి అడిగాను.

ఏడుస్తూనే 'నేను' అన్నది ఒక కోమల కంఠస్వరం. నేనా కంఠస్వరం వెంటనే గుర్తుపట్టాను. అది కోటేశ్వరమ్మది. నా శరీరం జలదరించింది. రక్తం

ఒక్కసారిగా వేడెక్కి గబగబ ప్రవహించటం మొదలుపెట్టింది. హృదయం రెపరెప కొట్టుకుంది. నేను నా వశం తప్పాను."

"యెందుకు యేడుస్తున్నావు?" అని అడిగాను.

"భయంగా వుంది" అని నన్ను మరీ కరచుకు పడుకుంది.

"దేనికి భయం?"

"నా ఒంటరితనం నన్ను భయపెడుతూవుంది."

"నే నామెను వోదార్చటానికి ప్రయత్నించాను. ఏడువకు" అన్నాను.

ఆమె ఇంకా యెక్కువగా ఏడ్చింది. నన్ను గాఢంగా కావిలించుకుంది. నే నామెను నా సందిటిలోకి తీసుకున్నాను.

అంతవరకు చెప్పి ఆపాడు. తరువాత జరిగింది యెవ్వరూ చెప్పనక్కరలేదు. నేను వూహించుకున్నాను. నేను వూహించానని అతను గ్రహించాడు. తల వంచుకొని మిగిలిన కథ చెప్పాడు

"ఆమె వెళ్ళిపోగానే నాకు తేళ్ళూ జెర్రులూ ప్రాకినట్లయింది. ఆమె అటు వంటిదని నేను ఇంతకుముందు కలలోకూడా అనుకోలేదు. నేను అటువంటి వాడి ననికూడా అనుకోలేదు. తలచుకున్నకొద్దీ నామీద నాకు అసహ్యంవేసింది. నా జీవితం నీకు తెలుసు. శుద్ధంగా బ్రతికి అవతలికి దాటిపోదామనే ఆవేశం కలవాణ్ణి. అందుకోసం జీవితంలో అనేక అవకాశాలు ఒదులుకున్నవాణ్ణి. ఒక్క క్షణంలో పతితులలోకెల్ల పతితు డనయ్యాను. ఇక అక్కడ ఒక్క క్షణంకూడా వుండలేకపోయాను. తెల్లవారకముందే ఆ ఇల్లుఒదిలి వెళ్ళిపోయాను. నాలుగయిదు రోజులు పిచ్చియెక్కిన వానికివలె తిరిగాను. ఆత్మ హత్య చేసుకుందామనికూడా అనుకున్నాను అప్పుడు నాకు భగవంతు డీమె ద్వారా పరీక్షిస్తున్నాడనే అనుమానం కలిగింది. అప్సరసల చేతుల్లో మోస పోయిన విశ్వామిత్రునివంటి మహర్షులు జ్ఞాపకం వచ్చారు. ఏమైనాసరే ఈ పరీక్షలో నెగ్గితీరాలని నిశ్చయించుకున్నాను. ఈ పరీక్షలో నెగ్గితే భగవత్ సాన్నిధ్యాన్ని జేరినట్లే అనుకున్నాను ఇప్పుడు యాదగిరిగుట్టలో వుంటున్న స్వాములవారిని నేను వారు గుంటూరు వచ్చినప్పుడు ఇకసారి దర్శనం చేసు కున్నాను వారు జ్ఞాపకం వచ్చారు. వెంటనే వెళ్ళి వారి ఆశ్రమంలో జేరాను. తదుపరి సంగతులు నీకు తెలిసినవే."

నా ముఖంలోకి చూడటానికి సిగ్గుపడి, తలవంచుకుని, మధ్య మధ్య చెమ్మ

గిల్లిన నయనాలను తుడుచుకొంటూ, గాద్గదిక స్వరంతో ఈ విషయాల నన్ని టినీ ఏకరువుపెడుతూన్న అతనిని చూస్తే నాకు చాలా విచారం కలిగింది.

"జరిగిందేదో జరిగింది శ్రీనివాస్. ఇప్పుడైనా నీవు ఇంటికి వెళ్ళి నీ మామూలు జీవితంలో పడిపోవటం మంచిదనుకుంటాను. లేనిపోయిన చిక్కులు యింకా యెందుకు తెచ్చిపెట్టుకుంటావు?" అన్నాను.

"భగవంతుడు తెచ్చిపెట్టిన ఈ పరీక్షలో నెగ్గకుండా నేను ఇంటికి వెళ్ళే ప్రసక్తి లేదు ఆయన నా మేలు కోసమే నన్ను తన సాన్నిధ్యంలోకి జేర్చుకోవటం కోసమే నా కీ పరీక్షను కల్పించాడు. ఆ స్వాములవారి ఆశ్రమంలో యింతచోటు చూపారు. వారి ఆజ్ఞకు వ్యతిరేకంగా నేను ప్రవర్తించను. వారికిగా వారు కల్పించిన ఈ అవకాశాన్ని జారవిడువను."

"మరిప్పుడేం చేద్దామంటావు?"

"నీవు నేర్పుగా మాటలు చెప్పగలవాడివి. ఆమెను నా దారికి అడ్డురావద్దని చెప్పు."

"అక్కడ నీ కేమైనా అడ్డువస్తుందా? నీ పనుల్లో ఏమైనా జోక్యం కలుగ జేసుకుంటూ వుందా?"

"లేదు. ఆమె ఇంతవరకు మాట్లాడనేలేదు."

"మరింకేమి?"


"ఇంకా నీ దగ్గర దాచటం ఎందుకు? ఆమెను నేను ప్రేమిస్తున్నాను. మొన్న ఆమెను చూచినప్పుడు నే నీ విషయం గ్రహించాను. ఆమె కన్నులపడితే చాల నాకు మనశ్శాంతి వుండదు."

"అయితే యిప్పుడు నువ్వు వెళ్ళు శ్రీనివాస్ నేను రేపు అక్కడకువచ్చి ఆమెతో మాట్లాడతాను. ఆమెతో నాకు ఇటీవల కొద్దిగా పరిచయం అయింది నా మాట వింటుందనే నా నమ్మకం. అయితే ముందుగా నీవు నా కొక మ టివ్వాలి" అన్నాను అతని భార్యాపిల్లల శ్రేయస్సుకోరి.

"యేమిటది?"

"నీవు ఇప్పట్లో సన్యాసాశ్రమం స్వీకరించే ప్రయత్నం చెయ్యకు. నాలుగైదు సంవత్సరాలు ఆధ్యాత్మిక చింతనలోవుండు. అప్పటికి నీకు సన్యాసాశ్రమం స్వీ రించాలనే భావం ప్రబలంగా వుంటే అప్పుడు స్వీకరిద్దువుగాని"

"అలాగే"




అతను ఒక విధంగా సంతృప్తిపడే వెళ్లాడు. మరునాడు రావలసిందని మరీ మరీ చెప్పి వెళ్ళాడు.

కాని నేను ఎంత వెళదామని ప్రయత్నించినా యాదగిరిగుట్ట వెళ్ళటం రెండు రోజులు పడలేదు. దానికి కారణం నా ట్రాన్స్‌ఫర్ విషయంలో మా ఆఫీసు సెక్రటరీగారినేకాక మినిష్టరుగారిని కూడా చూడవలసి రావటమే. ఆ పనులన్నీ చూచుకొని మూడోరోజు కారు వేసుకొని యాదగిరిగుట్ట బయలుదేరాను.

అక్కడ ఉత్సవాలు ముగింపుకొచ్చినై జనసమ్మర్దం తగ్గింది. స్వాములవారు శిష్యకోటితో వారి ఆశ్రమానికి తరలివెళ్ళటానికి సన్నాహాలు చేస్తున్నారు. కాని శ్రీనివాసరావుగానీ, కోటేశ్వరమ్మగానీ అక్కడ లేరు ఆరా తియ్యగా వారిద్దరూ గతంరోజు రాత్రి చెడునడత నడిచారనీ, స్వాములవారి శిష్యులు కొంతమంది వారిని పట్టుకున్నారనీ, దానిమీద స్వాములవారు వారిని తమ ఆశ్రమంలోనుంచి పంపించివేశారనీ తెలిసింది. వారు ఎక్కడికి వెళ్ళిందీ ఎవ్వరికీ తెలియదు. క్రింది గ్రామంలోనూ, పరిసర గ్రామాల్లోనూ వెదికి వేసారి నేను చేసేది లేక, హైదరాబాద్ వచ్చివేశాను.

వారు కూడా హైదరాబాద్ వచ్చివుండవచ్చనే ఆశ ఒకటి వుంది. ఇంటికి వచ్చి అడిగితే శ్రీనివాసరావు రాలేదని చెప్పారు. కబురుపెట్టి కోటేశ్వరమ్మ కూడా ఇంటికి రాలేదని తెలుసుకున్నాను.

ఎక్కడికి వెళ్ళారు? ఇద్దరూ కలిసి వెళ్లారేమో! ఎక్కడికైనా లేచిపోలేదు గదా! శ్రీనివాసరావు అంత నిబ్బరం అయిన మనిషి యింత వెర్రివాడెలా

య్యాడో నాకు తెలలేదు. కోటేశ్వరమ్మయినా జీవితం భహుబంగుల రుచి గాచిన మనిషి. అప్పుడే ప్రేమ మహత్యాన్ని కనుగొన్న దానివలె యెలా ప్రవ ంచిందో?

శ్రీనివాసరావు కోరినట్లు అతను వెళ్ళిన మరునాడే నేను యాదగిరిగుట్టకు ళ్ళివుంటే ఈ ప్రమాదం జరిగివుండకపోను అని అనిపించింది. ఏదో ఒక ధంగా వీలుచేసుకొని వెళ్ళి వుండవలసింది ఇంతలో యింత ప్రమాదం సంభ స్తుందని నేను ఊహించలేకపోయాను. ఊహించినట్లయితే నా ట్రాన్స్‌ఫర్ ంగతి ఏమయినా తప్పకుండా వెళ్ళివుండేవాణ్ణి ఆమె తనతో మాట్లాడటం లేద న్నాడు శ్రీనివాసరావు. తన విషయాలలో జోక్యం కలుగజేసుకోవటం లేద న్నాడు. కాబట్టి తొందర లేదనుకున్నాను. అటువంటివారు అకస్మాత్తుగా యెలా లిశారు అందులో శ్రీనివాసరావు తన జాగ్రత్తలో తాను వున్న మనిషి. ఐందు మాపులేకుండా యెలా ప్రవర్తించాడు? ఆమెమాత్రం అతనిని ఆ స్థితికి మెందుకు గుంజింది!

యిటువంటి అనేక ప్రశ్నలతో నా మనస్సు కలవరపడింది. నాకు కలవరమే బిగిలింది. వాళ్ళ ఆచూకీ నాకు చాలా కాలంవరకూ తెలియలేదు

ఈలోగా నాకు మళ్ళీ హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ వచ్చింది. హైదరాబాద్‌లోనే ఆఫీసుపని చూచుకుంటూ కాలక్షేపం చేస్తున్నాను. అమ్మిన ఇంటిమీద వచ్చిన బ్బుతో ఇల్లుకట్టుకొని గృహప్రవేశం చేశాను. మొదట్లో కొంతకాలం పెద్దల సమాజంలో కోటేశ్వరమ్మని గురించి అనేక పుకార్లు బయలుదేరినై ఎవ్వరో వొక వ్యక్తి ఆమెను లేవదీసుకొని వెళ్ళి ఆమె వొంటిమీదవున్న నగలూ నట్రా అమ్ముకుతిని, చివరికి వొదిలిపెట్టివేశాడనీ, ఆమె మామూలు వ్యభిచారిణికివలె బొంబాయిలో జీవితం గడుపుతూందనీ అన్నారు. బొంబాయిలో ఆమెను చూచా మని చెప్పేవారుకూడా కొందరు బయలుదేరారు. ఒక పెద్దమనిషి తాను బొంబా యిలో వ్యభిచార గృహాలు ఎలా వుంటాయో చూద్దామని వెళ్ళాననీ, ఆ గృహంలో వొకదాంట్లో కోటేశ్వరమ్మ కనుపించిందనీ, తనను చూచి మొహం చెల్లక కోపలకు పారిపోయిందనీ చెప్పాడు. మరొక పెద్దమనిషి ఢిల్లీవీధుల్లో ఆమె భిచ్చం ఎత్తుకుంటుంటే చూశానని చెప్పాడు. కొద్దిగా ధనసహాయంకూడా చేశా నన్నాడు. అతనిని చూచి ఆమె గావురున ఏడ్చిందట ఆ మధ్య మూసీనదిలో కూరుకొని కుళ్ళిపోయిన వొక శవం కనుపిస్తే అది కోటేశ్వరమ్మదేనని కొంత మంది పెద్దలు తీర్మానించారు,

ఇవన్నీ కూడా లైసెన్స్‌లకోసం కంట్రాక్టులకోసం ఉద్యోగాల ప్రమోషన్ కోసం, ఆమె చుట్టూ కుక్కపిల్లలకువలె తిరిగిన పెద్దమనుష్యులు వేసిన పుకార్లే.

క్రమక్రమేణా అంతా ఆమెను మరచిపోయారు. నాకే ఆమె అప్పుడప్పుడూ జ్ఞాపకం వొస్తూవుండేది ఆమెతోపాటు శ్రీనివాసరావు జ్ఞాపకం వొస్తూవుండే వాడు. అతను గుంటూరు జేరలేదని నా మిత్రునివల్ల తెలుసుకున్నాను.

అయిదారు నెలలు గడిచినై. ఒక రోజు తనను వచ్చి చూచివెళ్ళవలసిందని కోటేశ్వరమ్మ దగ్గరనుంచి అకస్మాత్తుగా కబురు వచ్చింది.

నాకు ప్రాణం లేచివచ్చినంత పనయింది; "ఎప్పుడు వచ్చింది?" అని వర్త మానం తెచ్చిన నౌఖరును అడిగాను.

"రాత్రి వచ్చారండీ. పొద్దున్నే మీ కోసం పంపారు. నేను మీరుండే పాత యింటికివెళ్ళి, అక్కడ ఉండటంలేదని తెలుసుకొని ఆ ఇంటోరిదగ్గర మీ అడ్రెస్ తీసుకొని ఈడకు వచ్చాను!" అన్నాడు.

"అమ్మగారు కులాసాగా వున్నారా?"

"ఏం కులాసో, ఏందో బాబూ. బొత్తిగా చిక్కిపోయారు. ప్రాణాలు కళ్ళల్లో వున్నయ్యంటే నా మాట నమ్మండి" అన్నాడు.

"అమ్మగారు వొక్కరే వొచ్చారా, ఇంకెవరయినా వున్నారా?"

"వొక్కరే వొచ్చారండీ."

నేను వెంటనే బయలుదేరి ఆమెను చూడటానికి వెళ్ళాను.

నేను వెళ్ళేటప్పటికి ఆమె హాల్లో చాప పరచుకొని పడుకొని వుంది. చిక్కిపోయిందని ముందుగా తెలిసివున్న నేనుకూడా ఆమెను చూచి నిర్ఘాంతపోయాను. మనిషి చాలా పాలిపోయింది. పదిమందిలో చూస్తే గుర్తుపట్టనంతగా మారిపోయింది. పూర్తిగా సన్నబడిపోయింది. తెల్లని చీర తెల్లని జాకెట్టు వేసుకొని నర్సులాగా వుంది. అయితే ముఖం మాత్రం నిర్మలంగా ప్రశాంతంగా వుంది. ముఖంలో ఇదివరకున్న గ్లామర్ లేకపోయినా, టెన్షన్ పోలేదు. నొసటన కుంకుమబొట్టు పెట్టి, చూడటానికి వొకరకంగా ముచ్చటగానే వుంది.

నన్ను చూచి లేచికూర్చుంది. నన్ను కూడా చాపమీదే కూర్చోమన్నది.

"శ్రీనివాసరావుగారు ఇంటిదగ్గరే వుంటున్నారా?" అని అడిగింది.

ఆమెనుంచి నా మిత్రుడు ఎక్కడవున్నదీ తెలుసుకోవచ్చనుకున్నా నేను. ఈ ప్రశ్నకు హతాశుడనయ్యాను.

"అతను ఎక్కడ వున్నదీ మీకు తెలియదా?"

"తెలియదు" అని నెమ్మదిగా తలవూపింది. ఆమె పైకి పొక్కకపోయినా ఆమె మనస్సులోని ఆతురతను, ఆమె నయనాలు ప్రస్ఫుటం చేశాయి.

"యాదగిరిగుట్టనుంచి మీరిద్దరూ కలిసివెళ్ళారనే అందరూ అనుకుంటు న్నారు."

ఆమె కొంచెంసేపు ఆలోచించింది. "అయితే ఇన్నాళ్ళనుంచీ ఆయన మీకు కనుపించనే లేదన్నమాట!"

"లేదు. ఇంటికికూడా రాలేదని విన్నాను. ఎక్కడ వున్నదీ ఎవ్వరికీ తెలి యదుకూడా" అని చెప్పి నేను వాళ్ళకోసం యాదగిరిగుట్ట వెళ్ళటం, అక్కడ విన్న సంగతులూ—అన్నీ చెప్పాను.

నా మాటలకు ఆమె కండ్లలో నీళ్ళు తిరిగినయ్ "నేను యాదగిరిగుట్ట ప్రయాణం అయినప్పుడు శ్రీనివాసరావుగారు అక్కడ వున్నారని నాకు తెలి యదు. ముందుగా తెలిసివుంటే వెళ్లేదాన్నో కాదో చెప్పలేను. అక్కడికి వెళ్ళి నేను ముందుగా స్వాములవారిని చూశాను. స్వాములవారి చూపుల్లోవున్న కాంతికి నేను మోహపడ్డాను. వారు ఆ చూపులను నాపైకి ప్రసరించినప్పుడల్లా మధుర స్రవంతిలో మునచెత్తుతున్నట్లు అనిపించింది. నా మనస్సుకు ఇన్నాళ్లూ ఎక్కడా దొరకని శాంతి వారిముందు లభ్యమైనట్లు అనిపించింది. ఇక అక్కడే ఆ స్వాములవారితోనే వుందామనుకున్నాను. వారికి నా అభిలాష నివేదించు కున్నాను. వారు అంగీకరించారుకూడా. అప్పుడు నేను, ఏదో కార్యార్థులైవెళ్ళి తిరిగివచ్చిన శ్రీనివాసరావుగారిని చూశాను వారిని చూడగానే నా మనస్సు ఏ రకం ఆందోళనకూ లోనుగాకపోయినందుకు నాలో నేనే ఆశ్చర్యపడ్డాను. అందుకు స్వాములవారి ప్రతిభే కారణమనుకున్నాను. నావలె శ్రీనివాసరావుగారు కూడా అచంచలమైన చిత్తశాంతిని స్వాములవారి సన్నిధిని పొందుతూ వుండా లని అనుకున్నాను. అందుకు సంతోషించాను నిజంగా సంతోషించాను. అప్పుడు నేను ఆనందాబ్ధిలో వోలలాడుతూవుండటంవల్ల నా మనస్సులో ఎటువంటి భౌతిక వాంఛలకూ తావులేకుండా వుంది. అందరినీ చూచినప్పుడు ఉన్నట్టేవుంది, శ్రీని వాసరావుగారిని చూచినప్పుడుకూడా. అంతకుముందు వారికోసం నేను పడిన ఆరాటం హాస్యాస్పదంగా కనుపించింది

"కాని ఆరాత్రి నేను మాత్రం ఊహించని సంఘటన జరిగింది. నాకు అర్ధ రాత్రి మెలకువ వచ్చింది. విపరీతమైన దాహం అయింది. మా అందరికీ మంచి నీళ్ళ కుండలు వేరే ఒక గదిలో వుండేవి. నేను వున్నచోట నా కోసం ప్రత్యేకం

మంచినీళ్ళు పెట్టుకోవాలనే ఆలోచన నాకు తట్టలేదు. నేను మంచినీళ్ళున్న గదిలోకి వెళ్ళాను మంచినీళ్ళు తాగుతుంటే గ్లాసులోనుంచి నీళ్ళు వొలికి చీరెమీద పడ్డవి. చలివులుకులు వొచ్చినయ్. తగ్గింతరువాత నా గదిలోకి నెమ్మదిగా బయలుదేరాను.

"ఎదురుగా శ్రీనివాసరావుగారు వస్తున్నారు. వారు చీకటిలో వస్తున్న నన్ను గమనించినట్టులేదు. ఎక్కడికో రివ్వున దూసుకుపోతున్నారు. వారికి నిద్రపట్టక బయట చల్లగాలిలోకి వెళ్తున్నారేమో? లేకపోతే నాకుమల్లే దాహం అయి మంచి నీళ్ళకోసం వొస్తున్నారేమో? నాకు దగ్గరగావచ్చి నన్ను చూశారు తడబడి నన్ను తప్పుకుపోదామని, పక్కకు తప్పుకుపోదామని నేనూ అదే తొలిగాను. ఇద్దరం వొకే ప్రక్కకు తప్పుకోవటంలో వారు నన్ను ఢీకొన్నారు. నేను పడబోయాను. వారు 'అయ్యో' అని కంగారుపడి నన్ను పట్టుకున్నారు. అంతే అంతకుముందు నాలోవున్న నిగ్రహం తుత్తునియలైంది శరీరం ఆయన చేతుల్లో గజగజ వొణికిపోయింది. రసవాహినిగా మారిపోయింది.

నేను అక్కడకు జేరినప్పటినుంచి స్వాములవారి శిష్యులొకరు నన్ను వొక కంట కనిపెడుతూ వచ్చారు. నేను మంచినీళ్ళకు బయలుదేరినప్పుడు ఎక్కడకు వెళుతున్నానోనని అయన నన్ను అనుసరించినట్లున్నారు మమ్మల్ని చూచి పెద్ద గోల లేవదీశారు. స్వాములవారి శిష్యవర్గమంతా అక్కడకు జేరి, మమ్ములను స్వాములవారిముందు నిలబెట్టారు. స్వాములవారు తక్షణం మమ్ములను ఆ స్థలం విడిచిపెట్టి వెళ్ళవలసిందిగా ఆజ్ఞాపించారు.

"నేను అప్పటికప్పుడే బయలుదేరాను. నా కారు అక్కడే వుంది. కారు తీసుకుని హైద్రాబాద్ వొచ్చివేశాను కారు ఇంట్లోపెట్టి గమ్యస్థానం లేకుండా రైలెక్కాను. అప్పుడు నాకు శ్రీనివాసరావుగారి సంగతి ఆలోచించబుద్ధే అవలేదు. మరొకసారి ఆయన జీవితాన్ని చికాకుపరిచినందుకు విచారించాను. మనస్సు వికలమై అనేక తీర్థయాత్రలు సేవించి తిరిగివచ్చాను మేమిద్దరం కలిసి వెళ్ళామని ఇతరులు అపోహపడుతున్నారని ఇప్పుడు మీరు చెపుతుంటే వింటున్నాను. నేనేం చెయ్యను?"

"వారు స్వాములవారివద్ద వున్నారని తెలిసి నేనక్కడకు వెళ్ళలేదు అర్ధరాత్రి మెలకువ రావటానికిగానీ, దాహం అవటానికిగానీ నా బాధ్యత ఏమీలేదు. వారూ అదే సమయానికి అక్కడకు రావాలా? ఇద్దరం వొకేప్రక్కకు తప్పుకోవాలా? ఇన్ని విపరీత సంఘటనలమీద ఆధారపడి జరిగిన దాని బాధ్యత నా కెంత

వరకు జరిగిందానినిబట్టిచూస్తే ఏదో వొక అద్వితీయమైనశక్తి జీవితం అనే వలను, యెక్కడో కూర్చొని చిన్న చిన్న దారపుపోగులతో కుడుతూవుంటుంది అని అనిపిస్తూంది" అన్నది.

ఇద్దరం కాసేపు మౌనంగా కూర్చున్నాం. ఆమె వొక్క నిట్టూర్పు విడిచి, "ఇంతకీ వారు ఎక్కడకు వెళ్ళిందీకూడా తెలియదన్నమాట" అన్నది.

"తెలియదు ''

"ఇలా యెందుకు జరుగుతుందో అర్థంకాకుండా ఉంది" అని ఆలోచనలో పడిపోయిందామె

అప్పటినుంచి ప్రతిరోజూ యేదో వొక సమయంలో నేను ఆమెను చూచి, కాసేపు కూర్చొని, కబుర్లుచెప్పి వెళుతుండేవాణ్ని. పాతస్నేహితులెవ్వరూ ఆమెను చూడటానికిగానీ, పలకరించటానికిగానీ వొచ్చేవాళ్ళుకాదు ఆమెకు ప్రభుత్వశాఖలోగానీ, ప్రముఖుల హృదయాలలోగానీ స్థానం లేకుండా పోయిం దని అందరికీ తెలిసింది ఇక ఆమె సంగతి యెవరికి కావాలి?

ఆనాటినుంచి ఆమె శ్రీనివాసరావు ఊసే ఎత్తేది కాదు, నేనుకూడా అతని ప్రస్తావన తెచ్చేవాణ్ని కాదు.


ఒకరోజు నేను వెళ్ళేటప్పటికి ఆమె కాఫీ కాస్తూఉంది. అసలే ఆమెకు ఆరోగ్యం సరిగాలేదు ఈ పనికూడా ఎందుకు నెత్తిన పెట్టుకుందా అని అయిష్టంగా చూశాను.

నా మనస్సులోని భావం కనిపెట్టి "ఇవ్వాళ కారు అమ్మివేశాను. నౌకర్లం దరికీ వారికి ఇవ్వవలసింది యిచ్చి పంపివేశాను. ఇకనుంచి నాకు కావలసిన పనులు నేనే చేసుకుంటాను" అన్నది చిరునవ్వు నవ్వుతూ.

"నీ ఆరోగ్యం కుదుటపడేవరకైనా ఈ పనులు నెత్తిన పెట్టుకోకుండా ఆగ వలసినది" అన్నాను.

"నేను వొంటరిదాన్ని నాకు వుండే పనులు మాత్రం ఏముంటై" అన్నది.

ఆమె చేసిన కాఫీ అద్భుతంగావుంది. ఆ విషయం నేను త్రాగుతున్నరీతిలో కనిపెట్టినట్టుంది. ఆమె చిరునవ్వు నవ్వుతూ, "ఏవో సిద్ధాంతాలూ సమస్యలూ అనుకొని వాటి వెంటపడతాం గానీ, ఈ చిన్న చిన్న విషయాలలో వున్న ఆనందం ఇంకెందులోనూ వుండదు. వీటిని వొదులుకొని వాటివెంట పడటం ఎదురుగా కనపడే మంచినీటి కొలను వొదులుకొని మృగతృష్ణ వెంటపడటం వంటిదే" అన్నది.




నేను ఆమెతో పూర్తిగా ఏకీభవించాను.

ఆపూట నేను ఆమెతోనే భోజనం చేశాను. "చాలా రోజులకు మళ్ళీ వంట మొదలుపెట్టాను. ఇవ్వాళ మీరు ఇక్కడే భోజనం చెయ్యాలి" అని ఆమె అంటే నేను కాదనలేకపోయాను.

ఆమె నాతో కబుర్లుచెపుతూ వంట పూర్తి చేసింది. ఆమె వంటచేసే పద్ధతి చూస్తే వంటపని వొక పెద్ద భారమైన పనిగా కనుపించలేదు నాకు. అన్నీ సిద్ధం చేసి వడ్డించింది.

నాతో ఆమె కలిసి భోజనం చెయ్యలేదు అలా భోజనం చెయ్యకపోవటం వొకప్పుడు తప్పు అనుకునేది. అవమానం అనుకునేదికూడా నేమో! ఇప్పుడు నాకు వడ్డించి యెదురుగా కూర్చొని, కబుర్లు చెపుతూ, అన్నీ ఎక్కువగా వడ్డిస్తూ నేను తృప్తిగా తింటూంటే ఆనందపడింది.

నా భోజనం పూర్తయినాక, తాను భోజనానికి కూర్చుంది.

* * *

ఒకరోజు నేను ఆమెను చూట్టానికి వెళ్ళేటప్పటికి, కేంద్రమంత్రికి పార్టీ ఇచ్చి మమ్మలను ఆహ్వానించిన నా మిత్రుడు కిషన్‌ప్రసాద్ ఇంట్లోనుంచి బయటకు వస్తున్నాడు. నన్ను చూసి, ఏదో తప్పుపని చేస్తున్నవానికిమల్లే బెదిరిపోయి నమస్కారంమీద నమస్కారం పెడుతూ వెళ్ళిపోయాడు.

నేను లోపలకు అడుగుపెట్టగానే, "ఈ ఇల్లు అమ్మివేద్దా మనుకుంటున్నాను" అన్నది కోటేశ్వరమ్మ.

"దేనికి?" అని నేను ఆశ్చర్యంగా అడిగాను.

"నా కెందుకింత పెద్దఇల్లు?"

"ఉంటే ఏం చేసింది?"

"తన బరువును నన్ను మొయ్యమంటున్నది" అన్నదామె చిరునవ్వు నవ్వుతూ.

కాని, నేను వచ్చేటప్పుడు నిష్క్రమిస్తున్న నా మిత్రుడికీ, ఆమె ఇల్లు అమ్మాలనే సంకల్పానికీ ఏదో సంబంధంవుండి వుండాలని నేను గ్రహించాను.

"ఈ మధ్య ఎవ్వరూ ఈ ఇంటికి రావటంలేదు. ఇప్పుడు వొచ్చివెళ్ళిన కిషన్ ప్రసాద్ ఏమైనా పనివుండి వచ్చాడా?" అని అడిగాను.

"కొద్దిగా పనుండే వొచ్చాడు."

"ఏమిటది?"

"ఏదోవొకటి పోనిద్దురూ!" అన్నది.

"తెలుసుకోవాలని వుంది" అన్నాను.

ఆమె కొంచెంసేపు ఆలోచించింది. చెప్పటమే మంచిదని తేల్చుకున్నట్లు వుంది "నేను అతనికి కొద్దిగా డబ్బు ఇవ్వవలసి వుంది" అన్నది.

"నే నెప్పుడూ వినలేదే!"

"చెప్పటానికి సిగ్గువేసింది" అన్నదామె చిరునవ్వు నవ్వుతూ. ఈ మధ్య ఆమె ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూనే వుంటుంది.

"ఒకవేళ ఇవ్వవలసివస్తే మాత్రం ఇల్లు అమ్మటం దేనికి?"

"మరి ఋణం ఎలా తీర్చటం? నా కింకొక విధమైన సంపాదన లేదుగదా!"

నే నిస్తానన్నాను. ఇల్లు అమ్మవద్దన్నాను. కాని ఆమె నామాట వినలేదు. డబ్బుకు సంబంధించిన లావాదేవీలు ఏ పరిస్థితుల్లోనూ నాతో పెట్టుకోదలచలేదని చెప్పింది. "మీకైనా తీర్చవలసిందేగా. ఎక్కడతెచ్చి తీర్చను?" అని ప్రశ్నించింది. "అయితే ఇల్లు అమ్మి ఎక్కడుంటారు?" అని అడిగాను.

"ఎక్కడ ఉంటే నాకు జరిగిపోదు?" అన్నది

మొత్తానికి ఇల్లు ఫర్నిచర్‌తో సహా అమ్మివేసింది సామానుల్లో ఆమె మిగుల్చుకున్నదల్లా భర్త ఫోటో.

వచ్చిన డబ్బులో కొంత ఇచ్చి నా మిత్రుని బాకీ తీర్చివేసింది. తీర్చిన పిదప ఆ బాకీ స్వభావం నాకు చెప్పింది. పూర్వాశ్రమంలో, ఏదో పనిచేసిపెట్టమని అతను ఆమె దగ్గరకు వచ్చాడట పని చేసిపెట్టగలందుకు కొంత డబ్బు కూడా ఇచ్చాడట. కాని ఆ పని కాలేదట. ఇన్నాళ్లూ వూరుకొని ఇప్పుడు పని కాలేదు గనుక నా డబ్బు నాకివ్వవలసిందని వొకటి రెండుసార్లు వచ్చి అడిగాట అతని డబ్బు ఇచ్చి వెయ్యటమే న్యాయమని తన బుద్ధికితోచి ఇచ్చివేసిందట!

ఈ విషయం చెప్పి, "ఇటువంటి బాకీలు ఇంకా కొన్ని వున్నాయి. అవన్నీ కూడా తీర్చివేద్దాం అనుకొంటున్నాను" అన్నది. అన్నట్లుగానే తీర్చివేసింది.

ఆమెకు అద్దెఇల్లు కుదిర్చే భారం నాపైన వేసుకున్నాను. రెండు మూడు ఇండ్లు చూశాను. అవి కొంచం పెద్దఇండ్లే అంత పెద్దఇండ్లు తనకు అవుసరం లేదన్నది. హైదరాబాద్ పట్టణపు అంచున వొక చిన్నతోటా అందులో వొక చిన్న ఇల్లూ వున్నది. ఎవ్వరో ఆ ఇంటిని గురించి వొకస్నేహితుడు చెపితే చూచి రావటానికి మేమిద్దరం వెళ్లాం. ఆమెకు ఆ ఇల్లు నచ్చింది. నాకు అట్టే నచ్చలేదు.

"ఊరికి మరీ దూరమైంది. రాకపోకలకు కూడా కష్టమే" అన్నాను.

"ఊరితో నాకేం పని?" అని అన్నదామె చిరునవ్వు నవ్వుతూ. "అచ్చంగా నాకోసం నిర్మింపబడినట్టే వున్నది ఈ తోటా, ఇల్లూనూ. ఇందులో వుంటాను" అన్నది

ఆ ఇంట్లో ప్రవేశించింది. ఆ ఇంట్లోకి ఆమె తనతోపాటు తెచ్చుకుంది తన భర్త ఫొటో వొక్కటే.

"ఈ ఫొటో, పిల్లిపిల్లను జేరవేసినట్లు వెళ్ళిన చోటికల్లా చేరవేస్తున్నాం" అన్నాను నేను నవ్వుతూ. ఇటీవల పెద్ద పెద్ద ఆవేశాలతో కూడుకున్న విషయాలను తేలికగా చూడటం ఆమెదగ్గర నుంచి నేను నేర్చుకున్నాను.

"నాకు మిగిలిన ఆస్తి ఇదొక్కటే గదా!" అన్నదామె చిరునవ్వు నవ్వుతూ.

ఆమెకు ఆ ఇంట్లో జేరినప్పటి నుంచీ ఆరోగ్యం మరీ చెడిపోయింది. నేను బలవంతాన డాక్టర్ని పిలిపించి చూపించాను. డాక్టరు జబ్బు ఇదమిద్ధమని తేల్చలేదు. మందులు మాత్రం ఇచ్చేవాడు. నామీద ఉన్న గౌరవంకొద్దీ త్రాగుతూ వుండేది. కాని క్రమక్రమేణా బలహీనపడటం మాత్రం ఆగలేదు.

"ఈ ప్రాణాలు నిలువుకోటానికి ప్రయత్నించటం కూడా తప్పేమో అనిపిస్తూ వుంది" అన్నది వొకరోజు.

ఆ మాటకు నా కండ్లు అప్రయత్నంగా చెమ్మగిలినై. ఆమె గమనించలేదు. చెప్పకుపోయింది.

"పోవలసినరోజు వచ్చేటప్పటికి ఈ ప్రాణాలను పోనివ్వటమే మంచిది. బలవంతంగా అట్టిపెట్టటం, పక్షిని పంజరంలో బంధించినట్లే అవుతుంది. ప్రస్తుతం నా మనస్సు ఈ శరీరంలో బంధింపబడి అలాగే కొట్టుకుంటూ వుంది. దానికి రెక్కలు వచ్చినై. దానికి ఎగిరిపోవాలని వుంది. కాని ఈ శరీరంమీద

మమకారం పోగొట్టుకోలేని నేను దానిని పట్టి బంధిస్తున్నాను. దాని రెక్కల సవ్వడి నాకు వినిపిస్తూనే వుంది. ఎందుకు వదిలిపెట్టి గూడదు దానిని? దానికి ఎందుకు స్వాతంత్ర్యం ఇవ్వగూడదు? దాని స్వాతంత్ర్యాన్ని అరికట్టే హక్కు నాకు ఎక్కడనుంచి వచ్చింది? ఎవరిచ్చారు?"

ఆమె అలా చెప్పుకుపోతుంటే నాకు హంసగానానికిమల్లే వినిపించింది. కండ్ల వెంట అశ్రువులు రాలాయి. ఆమె చూచి ఉలిక్కిపడింది. నన్ను చూడలేక తలవాల్చి, "నా పరిచయంలోనికి వచ్చిన వారెవ్వరూ సుఖపడలేదు. మీరూ సుఖపడరు. నేను యెన్నో పాపాలు చేసినదానిని. నాకోసం మీరెందుకు ఇంత బాధపడటం. నా దారిన నన్ను పోనివ్వండి" అన్నది.

నా కన్నీరు ఆమె చూడకుండా తలవంచుకొని "ను వ్విటువంటి మాటలు అనవద్దు" అన్నాను.

ఆమె నా బాధగ్రహించి "అనను. కాని ఈ జీవితం యెంత విచిత్రమైంది— నేను కోరుకున్న పరిచయాలన్నీ విషాదాంతాలుగా పరిణమించినై. నేను కోరుకున్న జీవితమే భగ్నమైపోయింది. యేనాడూ కోరుకోని, ఏమాత్రం ఆశించని మీరు చివరికి నా అండన నిలిచారు. మీ వల్ల నేను పొందుతున్న ప్రశాంతతకు నే నేవిధంగా మీ ఋణం తీర్చుకోగలను?" అన్నది.

ఆమె మాటలు హృదయాన్ని చీల్చుకువచ్చి నన్ను కలచివైచినై. ఆమె కాసేపు మౌనం వహించి మళ్ళీ అన్నది.

"ఇక ఈ జన్మలో మీకు నేను చెయ్యగలిగిందేమీ లేదు. వచ్చే జన్మలో మీ కడుపునపుట్టి మీ రుణం తీర్చుకుంటాను. భగవంతుడు నా ఈ కోర్కెను మన్నించగలడనే అనుకుంటాను" అన్నది.

నావల్ల ఆమె పొందిందానికంటే, ఆమెవల్ల నేనే ఎక్కువ ప్రశాంతత పొందుతున్నానంటే యెవ్వరు నమ్మగలరు? ఈ మాట ఆమెతో అంటే కమ్మని చిరునవ్వు ఒకటి నవ్వి వూరుకునేది.

నేను ఆమె దగ్గరకు వచ్చి వెళ్తుంటే వూళ్ళో అనేక గుసగుసలు బయలు దేరినై. నేను చూస్తున్నానుగదా! మామూలు మనుష్యులకు ఇటువంటి విషయాలు పట్టవు. వాళ్లు తమ జీవితాలను జీవించి వెళ్ళిపోతారు. యెటు తిరిగీ తెలివిగల వాళ్ళం అనుకునేవాళ్ళే ఈ శాఖలో నిరంతర కృషి చేస్తూంటారు. ఇతరుల జీవితాలను సునిశితంగా పరిశీలించి వీలైతే వేలుపెట్టి వారు పొందే ఆనందం ఏమిటో! వారు ఇతరులను గురించి చాలా లోతుగా ఆలోచించగలరు గాని,




అపార్థాల ప్రచారం మనకు యింత ఆనందం యిస్తూవుందే, మనలో యెంత మకిలి వుందో అని ఒక్క క్షణంకూడా ఆలోచించుకోలేరు. యెందుకనో!

నేను ఇటువంటివారి మాటలు లెక్కచెయ్యలేదు. పైకి యేవిధంగా ప్రవర్తిస్తున్నా లోపల నాకు తెలుసు ఆమె యెక్కువ కాలం జీవించదని. ఆమెను గాలికి విడిచిపెట్టి వూరుకుంటే భగవంతుడు క్షమిస్తాడా?

నేను ఒకరోజు వెళ్ళేటప్పటికి ఆమె పుస్తకాల షాపునుంచి భాగవతం తెప్పించుకొని ముందువేసుకొని కూర్చుంది. నన్నుచూచి చిరునవ్వు నవ్వి, "ఈ భాగవతంలోని కథలు చిన్నప్పు డెప్పుడో బళ్ళో చదివాను. అప్పటినుంచి పోతనగారి భాగవతంమీద మమకారం మనస్సులో నిలిచిపోయింది. ఎవ్వరినోట ఆయన పద్యాలువిన్నా నా మనస్సుకు చాలా ఆహ్లాదంగా వుండేది. మా బడిలో నా వయస్సుపిల్ల ఒకామె వుండేది. ఆపిల్ల రోజూ పోతనగారి 'యెవ్వనిచే జనించు' అనే పద్యం, 'లాఒక్కింతయులేదు' అనే పద్యం ప్రార్థన పద్యాలుగా రోజూ క్లాసు ప్రారంభించకముందు పాడుతూ వుండేది. విన ముచ్చటగా వుండేవి. అప్పటినుంచీ భాగవతం చదవాలనే కుతూహలం నాకు వుండేది. కాని నాకు తీరిక యెక్కడ!" అన్నది అని బిగ్గరగా నవ్వుతూ, "ఇన్నాళ్ళూ ఈ జీవిత ప్రవాహంలోపడి ఈదులాడటంతోనే సరిపోయెనే ఇప్పుడుగదా కాస్త

నిలకడ దొరికింది. అందుకని మనస్సు మళ్ళీ భాగవతంమీదకు పోతే చదువుదా మని తెప్పించాను" అన్నది.

తనను చూచి తను నవ్వుకోగలిగిన ఆమె సామర్ధ్యానికి, నాకు ఆశ్చర్యం వేసింది. సంతోషంకూడా కలిగింది. ఆమెను హేళనచేస్తూ, ఆమెను గురించే మలిన కథలు అల్లుకొని రుచికరమైన భోజన పదార్థాలను నెమరువేసినట్లువేస్తూ, తమలో తాము కినుక్కున నవ్వుకుంటూ తిరిగే ఆసాములలో యెవ్వరికి వుందీ సామర్థ్యం? వ్యామోహ పీడుతులైన తమలోవున్న దుర్గంధం పైకి పొగలకుండా అత్తరు పన్నీరు బుడ్లను గుమ్మరించుకొని. సున్నపుకుండల దొంతరలకుమల్లే భుజాలు ఎగరవేసుకుంటూ తిరిగే ఎంతమందికి వుంది ఈ సామర్థ్యం?

ఆమె అభిలాషను సమర్థిస్తూ "భాగవత పఠనంకంటే సత్కాలక్షేపం మరొకటి వుండదు" అన్నాను. "అయితే ఒక సంగతి. ఆ భాగ్యంలో నన్నుకూడా పాలు పంచుకోనివ్వు. నేను వచ్చినప్పుడల్లా నీకు కావలసిన సంఘటన చదివి వినిపిస్తూ వుంటాను. నీవు వింటూవుండు" అన్నాను.

అలా అనటానికి భాగవత పారాయణంలో వున్న ఆనందాన్ని అనుభవించటమేకాక, నా మనస్సులో మరొక కారణంకూడా వుంది. అప్పటికే ఆమె ఆరోగ్యం పూర్తిగా చెడిపోయి వుంది. ఆ పరిస్థితులలో చదువుతూ కూర్చుంటే ప్రమాదం సంభవించవచ్చనే భయంతో ఆ బాధ్యత నామీద వేసుకున్నాను.

"అలాగే" అన్నది. ఆమె నాపై తన చల్లని చూపులను ప్రసరిస్తూ ఆ క్షణం ఆమె, వయస్సులో నాకంటే యెంతో పెద్దదిగా కనుపించింది. మాతృదేవివలె కనుపించింది

ఆనాటినుంచీ విడవకుండా నే నామెకు భాగవతం చదివి వినిపిస్తూ వుండే వాడను ఆమె తెలివితేటలకు నాకు అచ్చెరువయ్యేది. ఆమె ఎక్కువ గ్రంథాలు చదివిన మనిషికాదు. చదివినవైనా శ్రద్ధగా చదివిన మనిషికాదు. కాని ఎంతటి మహత్తర విషయాన్నయినా యిట్టే అర్థం చేసుకునేది. ఎంతటి ఉన్నత స్థాయినైనా యిట్టే జేరుకొని విహరించేది

ఆమెకు గోపికలు కృష్ణునిమీద యశోదకు ఫిర్యాదు చెయ్యటం, గోపికా వస్త్రాపహరణం, ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం, రుక్మిణీ కల్యాణం మొదలైన ఘట్టాలు అత్యంత ప్రీతికరంగా వుండేవి కృష్ణుడు రుక్మిణి సోదరుడైన రుక్మిని యుద్ధంలో జయించి అతనితల రేవులువార గొరిగి పంపాడని చదువుతుంటే బిగ్గరగా నవ్వేది.

"మనకు మల్లేనే భగవంతుడికికూడా ఒక్కొక్కప్పుడు బుద్ధి చలిస్తూ వుంటుందనుకుంటాను" అనేది.

"ఎందుకు అలా అంటున్నావు?"

"లేకపోతే అతనిని యుద్ధంలో గెలిచి రుక్మిణిని తీసుకుపోతే సరిపోక పోయిందా? వెళ్తూవెళ్తూ అతని బుర్ర గొరిగి వెళ్ళటం ఎందుకు—అందులో రేవులువార? తానెంత భగవంతుడైతే మాత్రం అవతలి మనిషి తన ప్రియురాలి సహోదరుడు అనే జ్ఞానం వుండక్కర్లా" అని అనేది.

రుక్మిణి తనను వచ్చి రక్షించుకోవలసిందని శ్రీకృష్ణునికి ఉత్తరం వ్రాసిన ఘట్టం చదువుతుంటే, "పోతనగారు వ్రాయవలసిన విధంగా లేదు. మరీ మోడరన్‌గావుంది ఆ ముసలి బ్రాహ్మడు ఆ కాసేపు తన స్థాయి మరచిపోయి నట్లున్నాడు" అనేది.

అన్నిటికన్నా వింత నేను ప్రహ్లాదచరిత్ర చదివి వినిపించినప్పుడు ఆమెకు ప్రహ్లాదుని మీదకంటే హిరణ్యకశిపుని మీద గౌరవం కలగటం!

ఆ చరిత్ర అంతా సాంగోపాంగంగా విని, "ఏమోనండి, నాకు ప్రహ్లాదుని వ్యవహారం నచ్చలేదు" అన్నది.

ఆ మాటకు ఆశ్చర్యంతో నాకండ్లు విప్పారివుంటై నేను ప్రహ్లాదపక్షపాతిని. "ఎందుకని" అని ప్రశ్నించాను

"కమ్యూనిస్టు కుర్రవాడికిమల్లే తండ్రిమీదకు అట్లా ఎగబడతాడేమిటండీ? అభిప్రాయభేదం వుంటేమాత్రం కొడుక్కి తండ్రి అనే గౌరవం వుండక్కర్లా! అన్నీ గెలిచావు ఇంద్రియాన్ని కించిత్తుగెలువ నేరకపోయావు అంటాడు. అది కొడుకు తండ్రిని అనవలసిన మాటేనా? నాయనా! నీవు చదివిన చదువులు వినాలని వున్నది. ఏం చదువుకున్నావో చెప్పు అని తండ్రి బుజ్జగించి అడిగితే ఇష్టం వచ్చినమాట చెప్పవచ్చుగాని కమ్యూనిస్టు కుర్రవాడికిమల్లే బ్రహ్మాండమైన ప్రాపగాండా మొదలుపెడతాడేమిటండీ ఎంత వాత్సల్యం వుంటేమాత్రం అటువంటి కొడుకుని దండించక చేసేదేమిటి? అసలు సిద్ధాంతోద్రేకులంతా ఇంతే అనుకుంటాను. ఇతరులతో శిక్షింపబడటంలోనే సాఫల్యత వున్నదాన్నట్లు ప్రవర్తిస్తారు ఇతరులకు వొళ్ళుమరచి కోపంవచ్చేటట్లుచేసి వాళ్ళచేత శిక్షింప బడి కృతకృత్యులైనట్లు పరవళ్ళు త్రొక్కుతారు. నాకు ప్రహ్లాదుని వ్యవహారం బొత్తిగా బాగాలేదండీ, వొట్టి తొందరపాటు పిల్లవాడని అనిపిస్తూ వుంది. తొందరపాటువాడు గనుకనే తను చేసిన పనులకు పశ్చాత్తాపపడి తన మనుమ

తైన బలిచక్రవర్తికి, చిన్నప్పుడు తాను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వామనునికి దానం చెయ్యవద్దని, అతని కోర్కెలో ఏదో కుట్ర వున్నదనీ వారిస్తాడు" అన్నది.

భాగవతం సప్తమస్కంధంలో హిరణ్యకశిప నరసింహమూర్తులపోరు ఆమె నాతో పదిసార్లయినా చదివించుకొని వుంటుంది. ఎన్నిసార్లు చదివి వినిపించినా ఆమెకు తనివితీరినట్లుగా కనిపించలేదు.

"మనిషంటే హిరణ్యకశిపుణ్నే చెప్పాలి. నేనే జగన్నాధుడను అంటాడు. ఈ భూతశ్రేణికి నన్ను మించిన రాజు వొకడులేడు అంటాడు నేనా నారాయణుడి కోసం పలుమారు వెతికాము అతను నా కీ విశ్వంలో ఎక్కడా కనుపించలేదు. ఈ స్తంభంలో వున్నాడంటున్నావుకదా. చూపించు లేకపోతే నీ శిరస్సు వ్రక్కలు చేస్తాను అని తన చేతితో స్థంభాన్ని వొకమోదు మోదుతాడు స్థంభం విరిగి నరసింహమూర్తి అవిర్భస్తాడు. ఒక్క క్షణం చక్రి తనను శిక్షించటానికి వొచ్చాడనీ, అతనిచేత తనకు మృతి తప్పదనీ అనుకుంటాడు హిరణ్యకశిపుడు. అయితే ఏం? నా పరాక్రమ శౌర్యాలను చవిచూపుతాను. పలువుర మెప్పుపొందుతాను అని విజృంభించి, మహోద్దండమైన తన గదాదండమును గిరగిరా త్రిప్పి నృసింహమూర్తిని కొడతాడు. చూశారా, ఎంత పరాక్రమమో! భగవంతుడనే అనుమానముండి ముందుచెయ్యిచేసుకున్న ప్రతిభ చరిత్రలో వొక్క హిరణ్యకశిపునికే దక్కింది. వొక్కొక్కసారి అతనికున్న ఆత్మవిశ్వాసం భగవంతుడికి కూడా లేదేమో అనిపిస్తుంది. నిజంగా అతను జగన్నాధుడే. ప్రహ్లాదచరిత్ర వింటుంటే కొన్ని చోట్ల పోతన్నగారు కూడా హిరణ్యకశిప పక్షపాతే నేమోనని అనిపిస్తూవుంది" అన్నది.

ఈ విధంగా నేను చదివి వినిపిస్తూవుంటే ఆమె పడుకుని వింటూ వ్యాఖ్యానిస్తూ వుండేది. మొదట్లో ఆమె కేదో ఉపకారం చేద్దామని నేను భాగవత పారాయణం మొదలుపెట్టిన మాట నిజమే కాని పోను పోనూ ఈ పారాయణం వల్ల ఆమెకంటె నేనే ఎక్కువ ఉపయోగం పొందుతున్నట్లు గ్రహించి వినయ వినమ్రత శిరస్కుడినయ్యాను.

రోజులు గడిచిపోతున్నాయ్. చదువుతున్న నాకుగానీ, వింటున్న ఆమెకు గానీ ఎప్పుడూ విసుగు పుట్టలేదు. ఇద్దరం కలిసి భాగవతంలోని ముఖ్య ఘట్టాలన్నీ పూర్తిచేశాం.




మరుచాడు నేను వచ్చేటప్పటికి ఆమె మంచంమీద పడుకుని వుంది. ఇటీవల ఆమె ఎక్కువగా పడుకునే వుంటూ వుంది. ఒక స్టౌ దగ్గరగా పెట్టుకుని దాని చుట్టూ వంటసామాను పెట్టుకొని అక్కడే కాఫీ కాచుకోవటం, అన్నం వండుకోవటం చేస్తూవుంది. అందువల్ల ఆమె పండుకొని వుండటానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వలేదు. కాని తీరా దగ్గరకు వెళ్ళి చూచేటప్పటికి ఆమె పరిస్థితిలో చాలా మార్పువచ్చినట్లు కనిపించింది.

ప్రాణం కండ్లలో వుంది.

"మీకోసమే ఎదురు చూస్తున్నాను" అన్నది.

"ఏం జరిగింది?" అని ఆతురతగా అడిగాను.

"కాస్త కూర్చోపెట్టండి" అని అడిగింది.

ఆమెను లేవదీసి కూర్చోపెట్టాను. ఆమె మంచంమధ్య కూర్చున్నది. మనిషి చాలా నీరసపడిపోయింది. ముఖంలో కాంతిమాత్రం తగ్గలేదు.

"నేను వెళ్ళిపోతాను రాత్రి పిలుపు వచ్చింది" అన్నది.

నేను మాట్లాడలేదు.

"మిమ్మలను వొదిలివెళ్ళటం ఒక్కటే కొంచెం కష్టంగా వున్నది" అన్నది.

"ఇటువంటి మాట మాట్లాడనని మాట ఇచ్చావు. జ్ఞాపకం వుందా ?" అని నెమ్మదిగా అడిగాను.

"ఇన్నాళ్లూ ఆ మాట నిలబెట్టుకున్నానుగదా ! ఇప్పుడా మాటకు విలువ లేదు" అన్నది

నాకు నిజమే అనిపించింది.

"నేను వెళ్లేలోకం ఎటువంటిదైనా మీకు కనపడకపోవటం కొన్నాళ్ళు కొత్తగానే ఉంటుందనుకుంటాను" అన్నది చిరునవ్వు నవ్వుతూ.

"ఉదయం నుంచీ కాఫీ అయినా తాగావా?"

"కాఫీ కేంగాని నాకు కాస్త సహాయపడి ప్రక్కగదిలోకి తీసుకువెళతారూ?" అని అడిగింది.

"అలాగే" అన్నాను.

ఆమెను పట్టుకొని మంచంమీద నుంచి దింపి క్రింద నిలబెట్టాను. నడుము చుట్టూ చేయివేసి నేను సహాయపడగా ఆమె నా భుజంమీద తల ఆనిచ్చి అడుగులో అడుగు వేసుకుంటూ నడిచింది.

ఇద్దరం ప్రక్కగదిలోకి వెళ్ళాం అక్కడ గోడకు తగిలించి ఆమె భర్త ఫొటో ఉంది. దాని దగ్గరకు వెళ్ళటం ఆమెకోర్కె అని గ్రహించి నేను నెమ్మదిగా నడిపించి తీసుకువెళ్ళాను.

ఆమె ఆ ఫొటోను కాసేపు తదేకధ్యానంతో చూచింది "ఆయన కండ్లలో వెలుగు ఉన్నదికదూ?" అని అడిగింది.

"అవును."

"ఎక్కడనుంచి వచ్చిందా వెలుగు?"

"తెలివిగలవాళ్ళకు మనకవచ్చినట్టుగానే అమాయకులకు ఆ వెలుగు వస్తూ వుంటుంది" అన్నాను.

"ఎక్కడనుంచి"

"వారికి మనస్సులో నుంచి, వీరికి చిత్తంలో నుంచి" అన్నాను.

ఆమె చేతులు ముకుళించి ఆ ఫొటోకి నమస్కరించింది. "ఇక నన్ను తీసుకువెళ్ళి పడుకోబెట్టండి" అన్నది.

ఈసారి అడుగువెయ్యటం ఆమెకు మరీ కష్టమయింది. నేను చేతులమీద తీసుకువెళ్ళి పడుకోబెట్టాను




"ఆయన ఎప్పుడు నన్ను దగ్గరకు తీసుకున్నా పొలాలకూ, పచ్చిగడ్డికీ, పొగాకుకూ సంబంధించిన వాసన ముక్కుపుటాలను గిలిగింతలు పెడుతూ వుండేది. అది వ్యవసాయానికి సంబంధించిన వాసనేమో అని అనుకునేదాన్ని. కాదు స్వాములవారి దగ్గరకూడా అటువంటి వాసనే వస్తూవుండేది. ఇప్పుడు నాదగ్గర నాకు అటువంటి వాసనే తగులుతూ వుంది" అన్నది.

ఆమె మనస్సు భర్త జ్ఞాపకంతో నిండి వున్నదనుకొని, "ఆయనకు కబురు చెయ్యనా?" అని అడిగాను.

"ఎవ్వరికి?"

'నీ భర్తకు' అని అనలేకపోయాను. "ఆ ఫొటో ఆయనకు" అన్నాను.

ఆమె చిరునవ్వు నవ్వి "ఒద్దు. ఎవ్వరికి కబురు చేయవద్దు. మీరు వున్నారు అదేచాలు. మీకు అభ్యంతరం లేకపోతే నా ఉత్తరక్రియలు మీరే జరిపించండి" అన్నది.

ఇతర సంబంధాలు మాకేం లేకపోయినా, మా స్నేహం యెంత గాఢంగా పెనవేసుకుందో అప్పుడు నాకు దృగ్గోచరమయింది తన బాధ్యతలను ఇతరులకు వదలి నిర్విచారంగా ఉండగలిగిన అమాయకత్వం ఆమెలో ఉంది. అమాయకత్వం మనం ఒక్క పసిపిల్లలలోనే చూడగలుగుతాం జీవితంలో ఎన్నో అనుభవాలఛాయలు ఆమెమీద పడినా ఈ అమాయకత్వం కాస్తకూడా చెదరకపోవటం నాకు ఆశ్చర్యం కలిగించింది.

నేను వెళ్ళి డాక్టరుని తీసుకువచ్చాను. ఆయన వచ్చి ఇంజక్షను యిచ్చాడు. ఇంజక్షను ఇచ్చిన కాసేపటికి ఆమెకు నిద్రపట్టింది.

డాక్టరు నన్ను ప్రక్కగదిలోకి తీసుకువెళ్ళి ''యిక లాభంలేదు. ఈ రాత్రి గడుస్తుందో లేదో కూడా చెప్పలేను" అన్నాడు.

"మీరు చెయ్యగలిగింది చేశారు మిగిలినది భగవంతుని చేతిలో వుంది" అన్నాను

ఇక ఆరోజు నేను యింటికి వెళ్ళలేదు. ఆమెనే కనిపెట్టుకుని కూర్చున్నాను.

అర్ధరాత్రికి ఆమెకు కొంచం మెలకువ వచ్చింది. మంచం దగ్గర కుర్చీలో వున్న నన్ను గుర్తుపట్టింది.

"నేనా ఫోటో విడిచిపెట్టి వెళ్తున్నాను. దానిని నావెంట తీసుకు వెళ్ళలేను గదా, అసలాయనకు పంపించి వెయ్యండి" అన్నది. పెదవులమీద చిరునవ్వు ఉండనే ఉన్నది.

మళ్ళీ మగతతో కన్నుమూసింది. ఇక కన్ను తెరవలేదు. ప్రశాంతంగా ఇహలోకయాత్ర ముగించింది.

ఆమె కోరినట్లు ఉత్తరక్రియలు నేనే జరిపాను. ఆమె నాకు అప్పగించివెళ్ళిన ఫోటో ఆమె చెప్పినట్లు అసలాయనకు పంపించివేశాను. దానితోపాటు జతపరచి ఆమె మరణించిన సంగతి దానికి సంబంధించిన విశేషాలూ వొకే వుత్తరంలో వ్రాసి పంపించాను.

* * * *

ఆమె మరణానంతరం కొన్నాళ్ళకు నేను పనిమీద గుంటూరు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడు శ్రీనివాసరావు ఇంటికి వెళ్ళాను. అతను యింకా ఇంటికి తిరిగిరాలేదు. ఎక్కడున్నదీకూడా ఎవ్వరికీ తెలియదట. ఆమధ్య ఒకసారి తన పట్టణంనుంచి తీర్ధయాత్రలు సేవించటానికని వెళ్ళిన కొందరికి రామేశ్వరంలో కనుపించాడనీ, ఎంతపిలిచినా వినిపించుకోకుండా తప్పించుకు వెళ్ళిపోయాడనీ, తరువాత యెంత వెదికినా మళ్ళీ కనుపించలేదని తెలియవచ్చిందట. అక్కడివారిని కనుక్కుంటే అతనెవరో పిచ్చివాడనీ. అప్పుడప్పుడు వచ్చి భగవంతుని దర్శనం చేసుకొని వెళుతుంటాడనీ, ఎక్కడ ఉన్నదీ ఎవ్వరికీ తెలియదని చెప్పారట.

ఈ విషయాలన్నీ శ్రీనివాసరావు భార్యే చెప్పింది నాకు. చెప్పి "వారు తప్పకుండా తిరిగివస్తారు. అందులో నాకేమాత్రం సందేహంలేదు. నన్నూ పిల్లలనూ అన్యాయం చేసే స్వభావంకాదు వారిది. వారికి మేము ఎప్పుడో వొకప్పుడు జ్ఞాపకం రాకపోము. వారు తిరిగి రాకపోరు'' అన్నది.

ఆ యిల్లాలి ఆత్మ విశ్వాసానికి నేను మనస్సులో జోహారు లర్పించి ఇంటికి తిరిగి వచ్చాను.